PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 147 | విజయవాడ, ఆదివారం 29 డిసెంబర్ 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 29 December 2024 | Rs

బిఎస్ఎన్ఎల్‌లో మళ్లీ విఆర్ఎస్

- 19వేల మంది ఉద్యోగులపై వేటు..!

3

తెలుగు తేజం నితీశ్ సెంచరీ

- 8వ వికెట్‌కు శతకంతో రికార్డు

6

మన్మోహన్‌సింగ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

అశ్రునయనాలతో...

ముగిసిన మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలు

- హాజరైన రాష్ట్రపతి, ప్రధాని, విదేశీ ప్రముఖులు
- స్మారకంపై ముదురుతున్న వివాదం!

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు అశ్రు నయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. శనివారం ఉదయం 11.45 గంటలకు ఢిల్లీలోని పబ్లిక్ స్మశాన వాటిక నిగమ్‌బోధ్‌ఘాట్‌లో ఆయన భౌతికకాయానికి అధికారిక లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సోనియా గాంధీ తదితరులు మాజీ ప్రధానికి తుది వీడ్కోలు పలికారు. సిక్కు మత గురువులు గుర్బానీ కీర్తనలు పఠించగా, మన్మోహన్ సింగ్ పెద్ద కుమార్తె ఉపిందర్ సింగ్ ఆయన చితికి నిప్పంటించారు. సాయుధ బలగాల 21 తుపాకుల గౌరవ వందనంతో ఈ కార్యక్రమం ముగిసింది. మరోపక్క మన్మోహన్ సింగ్ స్మారకం ఏర్పాటుకు వీలైనంత త్వరగా స్థలం కేటాయించాన్న డిమాండ్ అంతకంతకూ ఊపందుకుంటోంది. ఈ విషయమై ప్రధాని నరేంద్రమోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు లేఖ, ప్రభుత్వ సమాధానం నేపథ్యంలో చాలామంది కాంగ్రెస్ నేతలు దీనిపై స్పందిస్తున్నారు. బిజెపి ప్రభుత్వం సిక్కు ప్రధానిని అవమానిస్తోందని పలువురు విమర్శించారు. అకాలీదళ్ కూడా ఈ డిమాండ్‌కు మద్దతు తెలిపింది. ఇందులో జోక్యం చేసుకోవాలని ప్రధానిని కోరింది. అంత్యక్రియలకు హాజరైన ఇతర ప్రముఖుల్లో కేంద్ర మంత్రులు అమిత్ షా, జెపి నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా, త్రివిధ దళాధిపతులు, భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గేల్ వాంగ్‌చుక్, మారిషస్ విదేశాంగ మంత్రి ధనంజయ్ రాంపుల్‌సహా విదేశీ ప్రతినిధులు ఉన్నారు. ఆయన భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించి కన్నీటి వీడ్కోలు పలికారు. గురువారం రాత్రి ఎయిమ్స్‌లో మరణించిన మన్మోహన్‌సింగ్ భౌతికకాయాన్ని శనివారం ఉదయం 8 గంటలకు అక్బర్ రోడ్ 24 లోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయానికి తరలించారు. భారీగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆయనకు నివాళు లర్పించారు. మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలు, స్మారకం ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించ డానికి ఎందుకింత తాత్సారం చేస్తుందో అర్థంకావడం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. ఆయన మిగతా 5లో

తెలుగుతోనే వెలుగు

- కాపాడుకుంటేనే భవిత • తెలుగుభాష పరిరక్షణ, వికాసం అవశ్యం
- 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో జస్టిస్ ఎన్‌వి రమణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

'తెలుగు భాష, సంస్కృతిని పరిరక్షించుకోవాలి. అప్పుడే మనం గొప్పవారిమవుతాం. భవిష్యత్తు బాగుంటుంది. జాతి మనుగడకు, వికాసానికి భాష కావాలి. అది లేకపోతే ఎన్ని ఉన్నా చరిత్రలేని అభాగ్యులమౌతాం' అని సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ అన్నారు . శనివారం ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభ ఘనంగా ప్రారంభమైంది. ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణా జిల్లా రచయితల సంఘం, కెబిఎన్ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన ఈ మహాసభను విజయవాడ కెబిఎన్ కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రామోజీరావు సభా వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంతరం మాట్లాడుతూ తెలుగు పరిరక్షణకు, వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. రాష్ట్రంలో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జిఒఎంఎస్ 85ని వెంటనే రద్దుచేసి పూర్వ తెలుగు విద్యావిధానాన్ని కొనసాగించాలన్నారు.

ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ

గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో జిఒఎంఎస్ 40 ద్వారా తీసుకువచ్చిన తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను పునరుద్ధరించాలని కోరారు. దేశంలో 100 మిలియన్ల మందికిపైగా తెలుగు మాట్లాడేవారు ఉన్నారని, దేశంలో మూడో స్థానంలో, ప్రపంచంలో 13వ స్థానంలో తెలుగు వాడుక భాషగా ఉందని తెలిపారు. క్రీస్తు పూర్వం 400 సంవత్సరాలకు ముందే తెలుగు ఉనికి భట్టిప్రోలు శాసనాలలో ఉందన్నారు. స్వాతంత్ర్య సమరంలో పోరాడిన తెలుగు వారికి తగిన గుర్తింపు లభించలేదన్నారు. గిడుగు నుండి గురజాడ, రఘుపతి వెంకటరత్నం నాయుడు, త్రిపురనేని, కందుకూరి వరకు తెలుగు భాషను కాపాడారని గుర్తు చేశారు. ప్రపంచంలో అనేక దేశాల వారు తమ మాతృభాష అభివృద్ధి ద్వారా అనేక లాభాలు పొందారన్నారు. గతంలో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించిన జలగం వెంగళరావు, మండలి వెంకట కృష్ణారావు, ఎన్‌టిఆర్‌లను గుర్తుచేసుకోవాలని అన్నారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ... తెలుగు పాలనా భాష కావాలని ఆకాంక్షించారు. తెలుగు జాతి ప్రకాశం, తెలుగు భాషా వికాసం కోసం రాజకీయాలకు అతీతంగా భాషాభిమానులందరినీ కూడగట్టే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. తెలుగు భాష, సాహిత్యాల గురించి ప్రజలను ఆలోచింపచేయటమే తమ లక్ష్యమన్నారు. ప్రపంచవ్యాప్తంగా భాషాభిమానంతో రెండు వేల మంది వరకు సాహితీ మూర్తులు సమావేశమై అమ్మభాషను కాపాడుకుందామనే సందేశం ఇస్తున్నారని పేర్కొన్నారు. భాష తన ఉనికిని కోల్పోతే అది నశిస్తుందనే భావన మిగతా 5లో

ప్రతిభ వెలికితీసేందుకే బాలోత్సవాలు

- పిల్లల పండుగల్లో పలువురు వక్తలు
- భీమవరం, పల్నాడు, తిరుపతి బాలోత్సవాలు ప్రారంభం

3

ముంచుకొస్తున్న మతోన్మాద ముప్పు

- ప్రజలు అప్రమత్తం కావాలి : బివి రాఘవులు

2

బిజెపికి నిధుల వరద

- ఏడాదిలో రూ.2244 కోట్ల విరాళాలు

5

పెరిగిన సైబర్ నేరాలు

- ఈగల్‌తో గంజాయికి అడ్డుకట్ట
- 'డిజిటల్ అరెస్ట్' కాల్స్‌పై ఫిర్యాదు చేయండి
- డిజిపి ద్వారకా తిరుమలరావు

డిజిపి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఈ ఏడాది సైబర్ నేరాల సంఖ్య పెరిగిందని డిజిపి ద్వారకా తిరుమలరావు తెలిపారు. మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో శనివారం వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కొంతమేర ఆందోళన కలిగిస్తోందన్నారు. సైబర్‌క్రైమ్ పట్ల ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాలన్నారు. డిజిటల్ అరెస్ట్‌లపై ఎవరూ ఆందోళన చెందవద్దని, అలాంటి కాల్స్‌వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో సైబర్ క్రైమ్ ముఠాలు ఫోన్‌లు చేస్తుంటాయని, అటువంటి వాటిని ఎవరూ నమ్మవద్దని చెప్పారు. చట్టంలో డిజిటల్ అరెస్ట్ అనే ప్రక్రియే లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం మూడు సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లు ఉన్నాయన్నారు. గంజాయి నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టామని గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈగల్ వ్యవస్థ సత్ఫలితాలు అందిస్తోందన్నారు. గంజాయిని నిర్మూలించ డంలో డ్రోన్ టెక్నాలజీ పెద్ద ఎత్తున ఉపయోగిస్తున్నట్లు వివరించారు. ప్రతి 10 పోలీస్ స్టేషన్లకు ఒక డ్రోన్ ఏర్పాటు చేస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఫింగర్ ప్రింట్స్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికే 10,837 ఎకరాల్లో గంజాయికి ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు వేయించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 25వేల సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, 2025 మార్చి నాటికి మరో లక్ష సిసి కెమెరాలు ఏర్పాటు చేయబోతున్నట్లు డిజిపి ద్వారకా తిరుమలరావు తెలిపారు. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా (గ్రాబింగ్) చేసే వారిపై పిడి యాక్ట్‌లు పెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియా పోస్టులపై రాష్ట్రవ్యాప్తంగా 572 కేసులు నమోదు చేశామని, ఇందుకు 381 మందిని బాధ్యులుగా గుర్తించామని, వీరిలో ఇప్పటి వరకు 210మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. 151మందిపై రౌడీషీట్స్ తెరిచామని డిజిపి తెలిపారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాకినాడ పోర్టులో బియ్యం రవాణాపై సిట్ విచారణ చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ యాక్సిడెంట్స్‌లో మరణించే ద్విచక్ర వాహనదారుల సంఖ్య పెరుగుతోందని, ఈ నేపథ్యంలో హెల్మెట్ వాడకం తప్పనిసరి చేసే క్రమంలో వాహనదారులకు ఫెనాల్టీలు వేస్తున్నామని తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పర్యటనలో నకిలీ ఐపిఎస్ వ్యవహారంపై విచారణ జరుగుతోందన్నారు.

సైబర్ క్రైమ్ కేసుల వివరాలు

1930 నెంబర్‌కు వచ్చిన కాల్స్	2023	2024
రిసీవ్ చేసుకున్న మొత్తం కాల్స్	4,74,391	7,23,378
ఎఫ్ఐఆర్ నమోదైన కేసులు	682	916
నష్టపోయిన అమౌంట్ (కోట్లలో)	173	1229
సీజ్ చేసిన అమౌంట్ (కోట్లలో)	49	225

20 నుండి దావోస్‌లో డబ్ల్యుఇఎఫ్ సమావేశాలు

న్యూఢిల్లీ : స్విస్ రిసార్ట్ డావోస్‌లో జనవరి 20 నుండి జరగనున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) సమావేశాలకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సహా పలువురు కేంద్ర మంత్రులు హాజరు కానున్నారు. వీరితో పాటు పలు దేశాల నుండి వందల సంఖ్యలో ప్రభుత్వ, వాణిజ్య నేతలు కూడా రానున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో 50కి పైగా అధ్యక్షులు, ప్రధానులు పాల్గొననున్నారు. ఐక్యరాజ్య సమితి, ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్, ఇంటర్‌పోల్, నాటో, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, డబ్ల్యుటిఓ వంటి పలు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా హాజరు కానున్నారు. ఈసారి ప్రధాని మోడీ హాజరవుతారా లేదా అనే అంశంపై ఇప్పటివరకు స్పష్టత లేదు. ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం, అమెరికాలో ప్రభుత్వ మార్పు వంటి పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశం జరుగుతోంది.

మరింతగా క్షీణించిన దల్లేవాల్ ఆరోగ్యం

- తక్షణమే చర్చలు ప్రారంభించాలన్న సిపిఎం
- 31వరకు గడువిస్తున్నాం, తగు చర్యలు తీసుకోండి
- పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని, రైతు రుణాలను రద్దు చేయాలన్న డిమాండ్ల సాధన కోసం నవంబరు 26 నుండి నిరాహార దీక్ష చేస్తున్న సీనియర్ రైతు నేత జగ్‌జిత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యం మరింత క్షీణించింది. ఈ నేపథ్యంలో రైతు సంఘాలతో తక్షణమే చర్చలు ప్రారంభించాలని, వారి డిమాండ్లను పరిష్కరించాలని సిపిఎం డిమాండ్ చేసింది. కాగా, దల్లేవాల్‌ను ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించేందుకు పంజాబ్ ప్రభుత్వానికి డిసెంబరు 31వరకు సమయం ఇస్తున్నామని సుప్రీం కోర్టు పేర్కొంది. ఒకవేళ కేంద్రం నుండి ఏదైనా సాయం కావాలంటే కోరాలని తెలిపింది. తమ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మిగతా 5లో

భోజ్‌పురి గాయనిపై బిజెపి నేతల దౌర్జన్యం

పాట్నా : మహాత్మా గాంధీజీకి అత్యంత ప్రీతిపాత్రమైన 'రఘుపతి రాఘవ రాజారామ్..' భజనను ఆలపించేందుకు ప్రయత్నించిన భోజ్‌పురి గాయకురాలు దేవిపై బిజెపి నేతలు దౌర్జన్యం చేసి మైక్ లాగేసుకున్నారు. వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 25న బీహార్ రాజధాని పాట్నాలో బిజెపి ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. 'రఘుపతి రాఘవ రాజారాం' గీతాన్ని గాంధీజీ సవరించి 'ఈశ్వర అల్లా తేరే నామ్. సబ్‌కో సన్మతి దే భగవాన్' అనే వాక్యాన్ని చేర్చడం ద్వారా మత సామరస్య గీతంగా మార్చారు. ఈ గీతాన్ని ఆలపించేందుకు దేవి ప్రయత్నించగానే, బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశాయి. కేంద్ర మాజీ మంత్రి అశ్వినీ కుమార్ చౌబే సహా పలువురు నాయకులు ఆమె నుండి మైక్రోఫోన్ లాక్కొని జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. ఆమెపై ఒత్తిడి చేసి అల్లా పేరు ఉచ్చరించినందుకు క్షమాపణ చెప్పించారు. ఈ ప్రపంచం యావత్తూ తన కుటుంబమేనన్నది హిందూ మతం భావన అని, విశ్వాసం ఏదైనా ప్రజలందరికీ దేవుని ఆశీస్సులు ఉంటాయని ఆ మతం నమ్ముతుందని, అలాంటప్పుడు ఆ వాక్యానికి ఎందుకు అభ్యంతరం చెబుతున్నారో అర్థం కావడం లేదని దేవి ఆవేదన వ్యక్తం చేశారు.

కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న బాబురావు



ప్రజాందోళనకు విజయం

గుంటూరులో స్మార్ట్ మీటర్లు తొలగింపు

ప్రజాశక్తి-గుంటూరు

పేదల ఇళ్లకు ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని ఆందోళన చేయడంతో వెనక్కి తగ్గిన అధికారులు శనివారం ఆయా స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లను తొలగించారు. గుంటూరు 41వ డివిజన్, పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లోని పేదల ఇళ్లకు ఇటీవల యజమానులు ఇంటిలో లేని సమయంలో దాదాపు 16 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. దీంతో స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎపిసిపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టారు. ప్రజాందోళనకు తలొగ్గిన అధికారులు శనివారం మీటర్లను తొలగించారు. వాటి స్థానంలో పాత మీటర్లను తిరిగి బిగించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, నగర కార్యదర్శి కె.నళినీకాంత్ తదితరులు కాలనీ ప్రజలను కలిసి అభినందించారు. గుంటూరులో పోరాడి విజయం సాధించిన బాటలోనే ఎక్కడికక్కడ ప్రజలు అడ్డుకోవాలని, నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అండగా నిలుస్తుందని తెలిపారు. జనవరి 7న నుండి విద్యుత్ నియంత్రణ మండలి జరిపే బహిరంగ విచారణలో ప్రజలు పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీయాలి కోరారు. స్మార్ట్ మీటర్ల ద్వారా రాబోయే రోజుల్లో విద్యుత్ చార్జీలు భారీగా పెరుగుతాయని, గంటకొక రేటు నిర్ణయించి వసూలు చేస్తారని తెలిపారు. కార్యక్రమం లో షేక్ ఖాశిం షహీద్, లూథర్ పాల్, షేక్ మస్తాన్ వలి, కె ఆంజనేయులు, యం.వెంకట నర్సయ్య పాల్గొన్నారు.

రైతు కుటుంబం ఆత్మహత్య

- అప్పల బాధతో భార్య ఇద్దరు పిల్లలకు ఉరి • ఆపై తాను బలవన్మరణం

ప్రజాశక్తి-సింహాద్రిపురం/పులివెందుల టౌన్

కడప జిల్లా సింహాద్రిపురం మండలంలో విషాదం చోటు చేసుకుంది. అప్పుల బాధ తాళలేక భార్య, తన ఇద్దరు పిల్లలకు ఉరివేసి ఆపై తానూ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. దుద్దకుంట గ్రామానికి చెందిన దంపతులు కొమ్మెర నాగేంద్ర (40), భార్య వాణి (38)లకు కుమారుడు భార్గవ్ (13) కుమార్తె గాయత్రి (12) ఉన్నారు. తన సొంత పొలం 1.42 ఎకరంలో చీనీ, మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని ఇతర పంటలు సాగు చేశారు. సాగు నిమిత్తం దాదాపు రూ.20 లక్షల మేర అప్పులు చేశారు. ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో అప్పుల భారం అధికమైంది. ఈ క్రమంలో తన పొలాన్ని రూ. ఏడు లక్షలకు అప్పుల వారికి రిజిస్టర్ చేశారు. మిగతా అప్పులు తీరే దారిలేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తమ పొలం వద్దకు మొదటగా భార్యను, ఆ తర్వాత కుమార్తెను, చివరగా కుమారుడిని నాగేంద్ర తీసుకుళ్లి తాడుతో మెడను చిదిమేసి హతమార్చాడు. అనంతరం తాను ఉరి వేసుకున్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో నాగేంద్ర తల్లి గమనించి పొరుగువారికి సమాచారమిచ్చారు. వారు వెతకసాగగా పొలం వద్ద నలుగురి మృతదేహాలు కనిపించాయి. మృతుడి బావమరిది ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి సవిత

రైతు కుటుంబం ఆత్మహత్యపై ఇన్‌ఛార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నలుగురు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు.

పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆత్మహత్య చేసుకొని వారి మృతదేహాలను పరిశీలించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంలో నష్టం రావడం, గత నాలుగు సంవత్సరాలుగా అప్పులు చేయడం వలన ఈ ఘటన జరిగినట్లు తెలుస్తుందన్నారు.



రైతు కుటుంబం (ఫైల్)

అధికారులపై దాడులు సహించబోం : పవన్

- గాలివీడు ఎంపిడిఒకు పరామర్శ
- రైతు కుటుంబం ఆత్మహత్యపై నివేదికకు ఆదేశం

3

విశాఖ అభివృద్ధిపై 'ఢిల్లీ' కుట్ర!

- ప్రభుత్వ రంగ సంస్థలకు టిడిపి కూటమి ద్రోహం
- సిపిఎం విశాఖ జిల్లా మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'2024 ఎన్నికల్లో ప్రజలెంతో నమ్మకంతో టిడిపి కూటమి పార్టీలకు ఓట్లేశారు. గడిచిన ఆరు నెలల్లో టిడిపి కూటమి అడుగులు సరిగ్గా పడలేదు.. విశాఖ అభివృద్ధిపై ఢిల్లీ కేంద్రంగా మోడీ పదేళ్ల కాలంలో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యానికి కుట్రలు చేస్తున్నా అధికార టిడిపి, జనసేన, ప్రతిపక్ష వైసిపి మోకాళ్లమీద నిలబడి మోడీకి మద్దతిస్తున్నాయి' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం 24వ మహాసభ నేపథ్యంలో విశాఖపట్నం జిల్లా పెందుర్తి జూనియర్ కాలేజీ నుంచి సుజాతనగర్ జంక్షన్ వరకూ సిపిఎం శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలతో భారీ ప్రదర్శన శనివారం నిర్వహించారు. అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్ అధ్యక్షత వహించారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రకు, విశాఖకు ఎన్నో హామీలిచ్చిన మోడీ ఒక్కటంటే ఒక్కటైనా అమలు చేయకుండా 2025 జనవరి 8న మళ్లీ విశాఖకు వస్తారని చెబుతున్నారని, ఇక్కడ రైల్వేజోన్‌కు ఇప్పటివరకూ దిక్కులేకుండా పోయిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లి వచ్చాక అసలు స్వరూపం బట్టబయలైందని, మిట్టల్‌కు ఆగమేఘాల మీద లైసెన్సులు ఇచ్చేయాలని ప్రతిపాదించడం, ఐరన్ ఓర్ ఇవ్వాలని మోడీని కోరడం చూస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడలేని మీరు 'మిట్టల్ కోసం గెలిచిన బ్రోకర్లా' అంటూ ప్రశ్నించారు. జగన్ నాలుగు సార్లు, చంద్రబాబు రెండు సార్లు కడపలో స్టీల్‌ప్లాంట్ కోసం శంకుస్థాపనలు చేయడం సిగ్గుచేటన్నారు. పరిశ్రమల రాకకు సిపిఎం వ్యతిరేకం కాదని, ఎక్కడ అవసరమో అక్కడకు అవి రావాలని చెప్పారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌ను కడపలో ఎందుకు పెట్టరని ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లాకు మిట్టల్‌ను తేవడం అంటే ఉన్న ప్రభుత్వ స్టీల్‌ను మూతవేయడానికేనని, ప్రజలు అప్రమత్తంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య స్టీల్‌లో 243 మంది పనిచేస్తే దానికి రూ.15వేల కోట్లు ప్యాకేజీని కేంద్ర స్టీల్‌మంత్రి ఇచ్చారని, అక్కడ జనతాదళ్ సెక్యులర్‌కు ఇద్దరే ఎంపిలు ఉన్నారని తెలిపారు. అదే విశాఖ స్టీల్‌లో 12వేల మంది కార్మికులుండి ఏడు మిలియన్ టన్నులు ఉత్పత్తి చేస్తుంటే మన రాష్ట్ర ఎంపిలు కేంద్రం నుంచి ఒక్కపైసా తేలేకపోయారని, వీరికి సిగ్గుందా? ఢిల్లీకెళ్లడం దేనికి? ఇంట్లో కూర్చోండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపి నుంచి టిడిపి మద్దతు లేకపోతే కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రమాదంలో పడుతుందన్నారు.

సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడే చరిత్ర సిపిఎంకే ఉందన్నారు. జీతాల్లేకపోయినా స్టీల్ కార్మికులు గణనీయ ఉత్పత్తిని ఈ నెలలో సాధించారని తెలిపారు. విశాఖ ఎంపి శ్రీభరత్ ఉక్కుపై హామీ ఇచ్చి చేతులు కట్టుకుని కూర్చోడం కంటే రాజీనామా చేయడం మేలన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ.. కార్పొరేట్ల మోసాలు, పాలకుల విధానాలపై ప్రజలకు నిజాలు చెప్పడమే సిపిఎం పని అని, ఆ నిజాలు ప్రజలకు తెలిస్తే పాలకులు రోజులు లెక్కపెట్టుకోవాల్సిందేనని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ.. ఎర్రజెండా బలం పెరిగితేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ.. సమస్త ప్రజల సమస్యలపై ఈ రెండు రోజుల మహాసభలో తీర్మానాలు చేసి భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ చేస్తామన్నారు. డాక్టర్ బి.గంగారావు, బి.పద్మ ప్రసంగించారు.

సిపిఎం 24వ మహాసభ పెందుర్తిలోని సుజాతనగర్ ఇంద్రాని కల్యాణ మండపంలో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. పార్టీ జెండాను సిపిఎం సీనియర్ నాయకులు విఎస్.పద్మనాభరాజు ఆవిష్కరించారు. మహాసభ జరిగే ప్రాంతానికి జి.సుబ్బారావునగర్, ప్రాంగణానికి జి.సన్యాసిరావు ప్రాంగణంగా నామకరణం చేశారు. సభలో అమరవీరులకు నివాళులర్పించారు. ప్రతినిధుల సభకు బి.పద్మ, పి.వెంకటరెడ్డి, పైడిరాజు, తౌడన్న అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

ర్యాలీ అగ్రభాగంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు

'స్టీల్'కు వెన్నుపోటు వద్దు

- రాయలసీమలో మిట్టల్ పరిశ్రమ పెట్టండి : వి.శ్రీనివాసరావు

రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలు, రాయలసీమ వంటి చోట్ల మిట్టల్ స్టీల్ పెట్టాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు వెన్నుపోటు పొడవద్దని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన పెందుర్తిలో మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ వెళ్లి రాష్ట్రానికి వచ్చాక ఉక్కు ప్రైవేటీకరణ జరగకుండా మోడీ చేత ప్రకటన చేయించడానికి ఎందుకు వెనుకాడుతున్నారో ముఖ్యమంత్రి ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగమే రాష్ట్రానికి ఆదాయ వనరు అని, విశాఖ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇదే కీలకమని చెప్పారు. దీన్ని కాదని అధికారంలోకొచ్చిన ఆరు నెలలు తిరగకముందే మిట్టల్‌కు సాగిలపడడం దేనికని ప్రశ్నించారు. డిప్యూటీ సిఎం పవన్‌కు ఇప్పుడు రాష్ట్ర ప్రజలు, వారి సమస్యలు పట్టడం లేదని, ఆర్‌ఎస్‌ఎస్ దేవుడు ఆయనకు దొరికాడని వ్యాఖ్యానించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటించి అక్కడ భూముల నుంచి గిరిజనులను వెళ్లగొట్టే ఆర్‌ఎస్‌ఎస్ అడుగులకు మడుగులొత్తడం, రాష్ట్రంలో దేవాలయ భూములను కబ్జా చేసేందుకు విశ్వహిందూ పరిషత్ స్కెచ్ వేస్తే పవన్ మిన్నకుండడమే సనాతన ధర్మమా? అని ప్రశ్నించారు. పాలన మొదలై ఆరు నెలలు కాకుండానే ప్రజలపై రూ.16 వేల కోట్ల విద్యుత్ భారాలను టిడిపి కూటమి ప్రభుత్వం వేసిందని చెప్పారు. ఒక్కో నెలలో ఒక్క పథకం అమలు చేసి ఉన్నా సూపర్-6 ఈ ఆరునెలల్లో పూర్తయ్యేవన్నారు. అదాని, మిట్టల్, జిందాల్ కార్పొరేట్ల లాభాల కోసం ప్రజలపై భారాలు వేస్తే సిపిఎం ఊరుకోదని హెచ్చరించారు.

ముంచుకొస్తున్న మతోన్మాద ముప్పు

- ప్రజలు అప్రమత్తం కావాలి : బివి రాఘవులు

ప్రజాశక్తి-నర్సాపురం

రాష్ట్రానికి మతోన్మాద ముప్పు ముంచుకొస్తోందని, ప్రజల అప్రమత్తం కావాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో రెండు రోజుల పాటు జరిగిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ విజయవాడలో జరగనున్న విహెచ్‌పి సభను ఆయన ప్రస్తావించారు. రాష్ట్రంలో తెలుగుదేశం,జనసేన,బిజెపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మతోన్మాదం వేగం పుంజుకుందన్నారు. పరోక్షంగా రాష్ట్ర ప్రభుత్వమే దీనికి సహకరిస్తోందని, ప్రభుత్వంలో భాగస్వాములైన జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ సనాతన ధర్మం అంటూ మాట్లాడారని, వేషం కూడా మార్చారని చెప్పారు. రాష్ట్రంలో మతోన్మాదాన్ని వ్యాప్తి చేయడానికి ఒక పద్ధతి ప్రకారం ప్రభుత్వాన్ని విహెచ్‌పి ఉపయోగించుకుంటోందని అన్నారు. 'దేవాలయాలను రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోంచి తప్పించి, మత సంస్థలకు అప్పగించాలనే డిమాండ్ చేస్తున్నారు. ఆలయాల్లో పనిచేసే ఇతర మతస్తులను తొలగించి, ఇతర శాఖలకు బదిలీ చేయాలని, కాంట్రాక్టు కార్మికుల్లో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలి' అని అంటున్నారని ఆయన చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానంతో ప్రారంభించి, ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఇదే అంశాన్ని లేవనెత్తుతున్నారని తెలిపారు.

నిజానికి శాస్త్రం, సంప్రదాయాల ప్రాతిపదిక నిర్వర్తించాల్సిన విధుల్లో అంటే రిలీజియస్ యాక్టివిటీస్‌లో ప్రభుత్వం ఏమీ జోక్యం చేసుకోదని తెలిపారు. ఆలయాల తరపున నిర్వహించే సెక్యులర్ కార్యక్రమాల్లోనే ప్రభుత్వ ప్రమేయం ఉంటుందని చెప్పారు. 'స్కూళ్లు నడుపుతున్నారు. ఆసుపత్రులు నడుపుతున్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వాటిల్లో కూడా మతాన్ని జొప్పించాలనే ప్రయత్నం చేస్తున్నారు. అది మంచిది కాదు. సెక్యులర్ పనులను సెక్యులర్ పద్ధతిలోనే నడిపించాలి. ఇది అందరికీ, అన్ని మతాలకు వర్తిస్తుంది.' అని వివరించారు. అదే సమయంలో మత ప్రాతిపదిక జరిగే క్రతువులను, సాంప్రదాయాలను వాటి ప్రకారమే నిర్వహిస్తారని చెప్పారు. దేవస్థానాలు నిర్వహించే సెక్యులర్ కార్యక్రమాల్లోనే ప్రభుత్వ జోక్యం ఉంటుందని, వాటిలోకి కూడా మతతత్వాన్ని జొప్పించే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. చర్చిలకు, మసీదులకు ప్రభుత్వ నియంత్రణ లేదని, దేవాలయాలకు మాత్రం ఎందుకనే వాదనను విహెచ్‌పి ముందుకు తెస్తోందని, అయితే, అన్ని దేవాలయలు ప్రభుత్వ నియంత్రణలో లేవని, కొన్ని సొంత గుర్తింపుతోనే ఉన్నాయని, కొన్ని కుటుంబాలు సొంతంగా దేవాలయాలు ఏర్పాటు చేసుకున్నాయని, అవి ఆ కుటుంబ పర్యవేక్షణలోనే ఉన్నాయని, వారు తమకు నచ్చిన పద్ధతుల్లో నిర్వహించుకుంటున్నారని చెప్పారు. భూములు, ఆస్తులతో పాటు ఆదాయం కూడా వస్తుంటే, ఉద్యోగులు కూడా ఉంటే వాటి నిర్వహణకోసం మాత్రమే హిందూ చారిటబుల్ అండ్ ఎండోమెంట్ యాక్ట్ వంటి చట్టాలు దేశ వ్యాప్తంగా వచ్చాయని తెలిపారు. ఆలయాల మత విధులకు ఈ చట్టాలకు ఎటువంటి సంబంధం లేదని చెప్పారు. అదే విధంగా గతంలో రాజులు, సంస్థానాలు కొన్ని దేవాలయాలను నిర్వహించారని, కాలక్రమేణా రాజులు, రాజరికాలు,సంస్థానాలు పోయిన తరువాత వారి స్థానంలో వచ్చిన ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలే వాటిని నిర్వహిస్తున్నాయని చెప్పారు. అందుకే శాసనసభలు వాటిని నిర్వహించేందుకు చట్టాలు చేశాయని అన్నారు. చర్చిలు, మసీదులు ఒక నిర్ణీత ప్రాంతంలో, పరిధిలో ఉంటాయని, అక్కడ ఉండే వారు కమిటీలు వేసుకుని వాటిని నిర్వహిస్తారని తెలిపారు. ఇలా నిర్వహించే దేవాలయాలు కూడా ఉన్నాయని ఆ దేవాలయాలను వారి, వారి ఆచార వ్యవహారాల మేరకే నిర్వహిస్తారని వివరించారు. తిరుపతి, కాశీ, మధుర, సింహాచలం, కనకదుర్గ వంటి కొన్ని దేవస్థానాలకు దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా భక్తులు వస్తులు వస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. రాజరిక వ్యవస్థ నాశనమై.. వాటి స్థానంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు వచ్చాయి కాబట్టి వాటి నిర్వహణను ఆ ప్రజాప్రభుత్వాలే చేస్తున్నాయని చెప్పారు. ఈ వ్యత్యాసం ఏమీ లేకుండా ప్రజల్ని మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ తరహా ప్రయత్నాల నుండి దేవస్థానాల పరిధిలో జరిగే సెక్యులర్ కార్యక్రమాలను కాపాడుకోవాలని చెప్పారు.

నేడు పిఎస్‌ఎల్‌వి సి-60 కౌంట్‌డౌన్

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోటలో పిఎస్‌ఎల్‌వి సి-60 ప్రయోగానికి 25 గంటల ముందు అంటే ఆదివారం రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. రాకెట్ నాలుగు దశలతో పాటు ఉపగ్రహాల అనుసంధాన పనులను ఇప్పటికే శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఈ రాకెట్ ద్వారా స్పేస్ డాకింగ్‌కు చెందిన స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను రోదసిలోకి ఇస్రో పంపనుంది.

ఎచ్చెర్ల ఎంపిడిఒపై దాడి!

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, ఎచ్చెర్ల

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎంపిడిఒ సీపాన హరిహరరావుపై వైసిపి నాయకులు దూషణలకు పాల్పడుతూ దాడికి పాల్పడ్డారు. అందిన సమాచారం మేరకు.. ఎచ్చెర్ల మండలంలో ఎన్‌ఆర్‌ఇజిఎ పనులకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు రూ. ఎనిమిది కోట్ల పనులకు సంబంధించి అధికారులకు సిఫార్స్ చేశారు. 26 పంచాయతీల నుంచి పనులకు సంబంధించిన వెండర్ ధ్రువపత్రాలను ఎంపిడిఒలకు అందించారు. వాటిని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేస్తున్న సమయంలో వెండర్ రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ చేయొద్దని, చేస్తే ఊరుకునేది లేదంటూ వైసిపి మండల స్థాయి ప్రజాప్రతినిధి ఎంపిడిఒను ఫోన్‌లో బెదిరించారు. దీంతో వెండర్ రిజిస్ట్రేషన్ చేయకుండా ఆయన ఆపేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే శనివారం మండల పరిషత్ అధికారులు, సిబ్బందిని తన కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారు. అక్కడి నుంచి ఎంపిడిఒ తన కార్యాలయానికి చేరుకునే సరికే వైసిపి నాయకులు అక్కడికి వచ్చారు. ఎంపిడిఒను దూషిస్తూ వైసిపి నాయకులు దాడికి పాల్పడారు. తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో స్థానిక పిహెచ్‌సికి ఎంపిడిఒను తరలించారు. జరిగిన విషయాన్ని జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజుకు ఎంపిడిఒ తెలియజేశారు. తను విధులు నిర్వహించే పరిస్థితులు లేవని సెలవు కావాలని చేసిన విజ్ఞప్తిని పరిగణనలోని తీసుకున్న జెడ్‌పి సిఇఒ సెలవు మంజూరు చేశారు. దాడి విషయంపై జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజుతో 'ప్రజాశక్తి' ఫోన్లో మాట్లాడగా ఒంట్లో బాగోలేదని సెలవు అడిగితే మంజూరు చేశానని జెడ్‌పి సిఇఒ బదులిచ్చారు. దాడి విషయమై మాట్లాడేందుకు ప్రయత్నించినా ఎంపిడిఒ స్పందించలేదు.

రాజ్యాంగ రూపకల్పనలో

తెలుగువారి సహకారం మరువలేం

- అసెంబ్లీ కేలండర్ ఆవిష్కరణలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారత రాజ్యాంగ రూపకల్పనలో తెలుగువారి సహకారాన్ని మరువలేమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని రూపొందించడానికి బాధ్యత వహించిన నాయకులు-దార్శనికులను స్మరించుకోవడం సంతోషాన్నిచ్చిందన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, రాజ్యాంగ రచనలో భాగస్వాములైన తెలుగు ప్రముఖులను స్మరించుకునేలా రూపొందించిన అసెంబ్లీ కేలండర్ (2025)ను ఉండవల్లిలోని తన నివాసంలో సిఎం శనివారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ రచనలో టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య స్థానిక సంస్థలు, గవర్నర్ విచక్షణ అధికారులు, పరిపాలనా, శాసన వ్యవస్థలపై సిఫార్సులు చేసినట్లు గుర్తు చేసుకున్నారు. దుర్గాభాయి దేశముఖ్ జాతీయ భాష, న్యాయ వ్యవస్థ, మానవ అక్రమ రవాణాపైనా, మోటూరి సత్యనారాయణ జాతీయ భాష గురించి, గోగినేని రంగనాయకులు (ఎన్‌జి రంగా) అధికార వికేంద్రీకరణ, అత్యవసర అధికారాలు, రెండు సభలు, ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుపై కీలక సూచనలు చేశారని తెలిపారు. నీలం సంజీవరెడ్డి, కల్లూరు సుబ్బారావు, రాజా రామకృష్ణరంగారావు, అల్లాడి కృష్ణస్వామి, కళా వెంకటరావు, మొసలికంటి తిరుమలరావు, విసి కేశవరావు రాజ్యాంగ రూపకల్పనలో పలు అంశాలపై సహకారమందించారని చెప్పారు. వారి చిత్రాలతో, సభలో వారు చేసిన ప్రసంగ అంశాల్లో లభ్యమైన మేరకు ఈ కేలండర్‌లో పొందుపరచడం అభినందనీయమన్నారు.

సామాజిక మాధ్యమాల్లో శాసన వ్యవస్థ సమాచారం

ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ కోసం తొలిసారి ప్రవేశపెట్టిన సామాజిక మాధ్యమ ఖాతాలను ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు ప్రారంభించారు. శాసన వ్యవస్థ ఎక్స్, యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు శాసన వ్యవస్థకు సంబంధించిన సమాచారం సోషల్ మీడియాలో ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. సభా కార్యకలాపాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు దోహదపడతాయని చెప్పారు. సామాజిక మాధ్యమాలు కేవలం సమాచారం కోసమే కాకుండా సభలో అర్థవంతమైన చర్చలకు వేదిక కావాలని ఆకాంక్షించారు. సవాళ్లను స్వీకరించి, శాసన వ్యవస్థ చేపట్టిన వినూత్న ప్రయత్నాలకు మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తున్న సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి కె రఘురామ కృష్ణరాజును ఈ సందర్భంగా సిఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ధర్నాలు

- వైసిపిపై మంత్రి పార్థసారథి విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఛార్జీలు పెంచారంటూ ఐదేళ్ల తప్పులను కప్పిపుచ్చుకునేందుకే వైసిపి నేతలు అబద్ధపు ధర్నాలు నిర్వహించారని సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వార్థం, అనుభవ రాహిత్యం, తన వారికి ప్రజల సొమ్ము దోచిపెట్టాలనే గుణంతో జగన్ పాలన సాగించారని ఆరోపించారు. చంద్రబాబు పాలనలో మిగులు విద్యుత్‌గా ఉన్న రాష్ట్రం జగన్ పాలనలో నిర్వీర్యమైందని విమర్శించారు.

'నమస్కారం'పై దుష్ప్రచారం తగదు : మంత్రి కొండపల్లి

శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణకు సంస్కారంతో నమస్కారం పెడితే దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ 11న ఎమ్మెల్యేలతో పాటు తను కూడా అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో బొత్స ఎదురుపడ్డారని తెలిపారు. చూడగానే ఆయనకు నమస్కారం చేశానని తెలిపారు. అక్కడ కూర్చొని ఉన్న ఇతర నాయకులు లేచి పలకరించారని, దీనిపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 ఏళ్ల నుంచి బొత్స కుటుంబం భూ దందాలు, లిక్కర్ దందాలు చేస్తూ వచ్చిందని ఆరోపించారు.

మన్మోహన్ సింగ్‌కు 'టిడిపి' ఘన నివాళి

మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు టిడిపి ఘన నివాళి అర్పించింది. ఆ పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి టిడిపి నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి ఆనం వెంకట రామనారాయణరెడ్డి మాట్లాడుతూ.. మన్మోహన్‌సింగ్ దేశానికి అవిశ్రాంతంగా సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, టిడి జనార్ధన్, ఎమ్మెల్యే బడేటి చంటి, నేతలు బుచ్చిరామ్ ప్రసాద్, మీడియా కో-ఆర్డినేటర్ దారపనేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రభుత్వం, ప్రజలు, కార్మికులు ఐక్యంగా పోరాడి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 1416వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో యూస్, డిఐటియు, విఎస్‌ఎంఎస్, జెఎంఎస్, విఎస్‌ఇయు యూనియన్ల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు శ్రీనివాసరావు, పరంధామయ్య మాట్లాడుతూ.. కార్మికుల పోరాటాలను నిర్వీర్యం చేయాలని చూసిన యాజమాన్యం కుట్రలు ఫలించలేదన్నారు. రిజర్వేషన్ల వలన స్టీల్‌ప్లాంట్‌లో బడుగు బలహీన వర్గాలకు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. వేలాది మంది కార్మికులు కుటుంబాలతో సమాజంలో ఉన్నతంగా జీవిస్తున్నారని, అలాంటి వారిని మళ్లీ అట్టడుగుకు నెట్టాలని చూస్తోన్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరును వ్యతిరేకించాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కాపాడుకోలేకపోతే అధికారంలో ఉండి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు.

నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

మానవహక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల మాజీ అధ్యక్షులు

మాధవరావు మృతి

- భౌతికకాయాన్ని ప్రభుత్వ వైద్యకళాశాలకు అందజేస్తామని కుటుంబీకుల వెల్లడి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

మాధవరావు(ఫైల్)

మానవ హక్కుల వేదిక ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాజీ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు కన్నుమూశారు. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రిలో చేరిన ఆయన శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. మాధవరావు మృతదేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలకు అందజేయనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నేత్రాలను లయన్స్ క్లబ్‌కు ఇవ్వనున్నారు. గొర్రెపాటి మాధవరావు స్వస్థలం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం బస్వాపూర్ గ్రామం. సుమారు నాలుగు దశాబ్దాలకుపైగా మానవ హక్కుల గొంతుకగా నిలిచారు. రైతుల ఆత్మహత్యలపై చలించి ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించేలా పత్రికల్లో కథనాలు రాశారు. విప్లవోద్యమ మేధావిగా జిల్లాలో పెద్ద దిక్కుగా పనిచేశారు. ఎన్‌కౌంటర్ కేసులపై వాదించి బాధితులకు నష్టపరిహారం అందేలా కృషి చేశారు. పిడిఎస్‌యు నిర్మాత జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ పేరు మీద నిజామాబాద్ కోటగల్లిలో గ్రంథాలయం ఏర్పాటు చేసి దాని నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు.

ప్రజా హక్కులకు తీరనిలోటు : సిపిఎం సంతాపం

గొర్రెపాటి మాధవరావు మృతికి సిపిఎం నిజామాబాద్ జిల్లా కమిటీ నాయకులు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల పట్ల అంకితభావంతో పనిచేసిన మాధవరావు న్యాయవాదిగా అనేకమంది అభాగ్యులకు బాసటగా నిలిచి వారిపక్షాన పోరాటం చేసినట్టు గుర్తు చేశారు.

పవన్ కల్యాణ్ పర్యటనలో నకిలీ ఐపిఎస్

- నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-సాలూరు

పవన్ కల్యాణ్ పర్యటనలో పోలీసు సిబ్బందితో సూర్య ప్రకాశరావు తీసుకున్న ఫొటో

ఇటీవల డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సాలూరు నియోజకవర్గ పర్యటనలో నకిలీ ఐపిఎస్ అధికారి పాల్గొనడం కలకలం రేపింది. పవన్ కల్యాణ్ పర్యటనలో ఆయన వెన్నంటే ఉండి కలియతిరగడం, ఫొటోలకు ఫోజులివ్వడం, అవి బయటకు రావడంతో పార్వతీపురం మన్యం జిల్లా పోలీసులు విచారణ చేపట్టారు. నకిలీ ఐపిఎస్ అధికారి అని తేలడంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వివరాలను సాలూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో అడిషనల్ ఎస్‌పి దిలీప్ కిరణ్, ఎఎస్‌పి అంకితసురానా శనివారం మీడియాకు వెల్లడించారు. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం గడసాం గ్రామానికి చెందిన బలివాడ సూర్య ప్రకాశ్‌రావు 2003 నుంచి 2005 వరకు పంజాబ్ రెజిమెంట్‌లో సిపాయిగా పని చేశాడు. రెండేళ్ల పని చేసిన తర్వాత ఆ ఉద్యోగం వదిలేసి బొబ్బిలిలోని తాండ్రపాపారాయ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్, తర్వాత ఎంబిఎ పూర్తి చేశాడు. కొంతకాలం తూనికలు కొలతలు శాఖలో లైసెన్స్ పొందిన స్కిల్ వర్కర్‌గా పని చేశాడు. అయితే, ఆయన తండ్రి తవిటినాయుడు 2005లో గ్రామంలో 9.79 ఎకరాల భూమిని కొనుగోలు చేసి పురోణీ రాయించుకున్నాడు. ఆ భూమి తండ్రి పేరిట రిజిస్ట్రేషన్ కాలేదు. 2020లో తవిటినాయుడు మరణించిన తరువాత కొనుగోలు చేసిన భూమి గురించి సూర్యప్రకాశ్‌రావుకు తెలిసింది. పురోణీ పత్రాలు ఇంట్లో లభ్యం కావడంతో ఆ భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రయత్నాలు మొదలు పెట్టాడు. 2024 జనవరిలో తాను ఐపిఎస్‌కు సెలెక్ట్ అయ్యానని, శిక్షణకు వెళుతున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ శిక్షణ పొందుతున్నట్లు నమ్మబలికాడు. ఈలోగా పవన్ కల్యాణ్ పర్యటన మన్యం జిల్లా మక్కువ మండలంలో ఉందని తెలుసుకొని నకిలీ ఐపిఎస్ అధికారి గుర్తింపు కార్డుతో వచ్చాడు. తాను ఐపిఎస్ అధికారినని గ్రామస్తులను, అధికారులను నమ్మించడానికి పోలీసు సిబ్బందితోనూ, పవన్ కల్యాణ్‌తోనూ కలిసి ఫొటోలు తీసుకున్నాడు. ఈ ఫొటోలు తన వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నకిలీ ఐపిఎస్ అధికారి గుర్తింపు కార్డుతో మోసం చేసినందుకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

కుసులవాడ మైనింగ్‌కు అనుమతులొద్దు

- ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి -ఆనందపురం (విశాఖపట్నం)

పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ కుసులవాడ, చిన్నయపాలెం గ్రామస్తులు ప్రజాభిప్రాయ సేకరణలో నిరసన తెలిపారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ సర్వే నెంబరు 104లో తెల్లకొండ (ఎద్దుమెట్ట) మైనింగ్‌కు తహశీల్దార్ శ్యాంసుందర్ ఆధ్వర్యాన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (హెచ్‌పిసిఎల్) సుధాసాగర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల సమక్షంలో శనివారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రజాభిప్రాయ సేకరణకు ప్రజలు భారీగా తరలివచ్చారు. చిన్నయ్యపాలెం, ఇచ్ఛాపురం, రేగన్నగూడెం, కుసులవాడ ప్రజలు ర్యాలీగా వెళ్లి సమావేశం రద్దు చేయాలని నినాదాలు చేశారు. మైనింగ్ చేసే పరిసరాల్లో కాకుండా ఇచ్ఛాపురం గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం ఏర్పాటు చేయడం సరికాదన్నారు. పంచాయతీకి సంబంధంలేని కొంతమంది కిరాయి మనుషులను ఈ సమావేశానికి తీసుకొచ్చి అనుమతులకు సుముఖముగా ఉన్నామని చెప్పించడం ప్రజా వ్యతిరేక చర్య అని సిపిఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి పేర్కొన్నారు. ఒక్కసారి అనుమతి ఇస్తే 20 ఏళ్ల వరకు ఈ పరిసర ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటాయన్నారు. చిన్నయ్యపాలెం తదితర ప్రాంతాల గిరిజన ప్రజలను కొంతమంది రాజకీయ నాయకులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఏ విధంగా మైనింగ్ అనుమతులను అడ్డుకుంటారో చూస్తామని హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. ఐద్వా నాయకులు కె.నాగరాణి మాట్లాడుతూ.. ఆనందపురం వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, ఇక్కడ భూములను మైనింగ్ పేరుతో కొల్లగొడితే కాలుష్యంతోపాటు పరిసర ప్రాంతాల పశువులు అంతరించిపోతాయని తెలిపారు. చిన్నయ్యపాలెం దళిత యువకుడు భీమరాజ్ మాట్లాడుతూ.. సర్వే నెంబరు 104లో మైనింగ్ చేపడితే మొదటిగా నష్టపోయేది చిన్నయపాలెం గ్రామ ప్రజలని, వారి అభిప్రాయాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని, కిరాయికి వచ్చిన మనుషులు అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోరాదని అధికారులను కోరారు. మైనింగ్ చేసే ప్రాంతానికి 200 మీటర్లలోపు చిన్నయ్యపాలెం, గొల్లలపాలెం, 600 మీటర్లలోపు కుసులవాడ ఎస్‌సి కాలనీలు ఉన్నాయని, ఏ విధంగా అనుమతులు ఇస్తున్నారని ప్రశ్నించారు. కుసులవాడ సర్పంచ్ భర్త మహంతి శివాజీ మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని నిర్ణయం చేయాలన్నారు. కుసులవాడ గ్రామస్తులు శినగం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతులు పంటలు వేసుకొని జీవనోపాధి పొందున్న ప్రాంతంలో మైనింగ్ పేరుతో విధ్వంసం సృష్టించడం సరికాదన్నారు. మైనింగ్ సమీపంలో ఇండో టిబెటన్ బెటాలియన్, పోలీస్ బెటాలియన్, పలు లే-అవుట్, వన్యప్రాణులు ఉన్న విషయాలను పట్టించుకోకుండా అనుమతులు ఇవ్వడం తగదన్నారు. కుసులవాడ నాయకులు శినగం దాము మాట్లాడుతూ ప్రజలకు హాని కలిగించే మైనింగ్‌కు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సుమారు 35 మంది స్థానికుల అభిప్రాయాలను అధికారులు రికార్డు చేసుకున్నారు. ఎక్కువమంది అనుమతుల వద్దంటూ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మైనింగ్‌ను వ్యతిరేకించినా తమ అభిప్రాయాలను వమ్ము చేయడానికి సంస్థ కుట్రలు చేసిందని ప్రజలంతా భావిస్తున్నారు. డిప్యూటీ కలెక్టర్ సుధా సాగర్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నివేదికను అందజేస్తామని తెలిపారు. చిన్నయ్యపాలెం, ఇచ్ఛాపురం, రేగానిగూడెం, కుసులవాడ, గొల్లలపాలెం గ్రామస్తులందరూ అనుమతులు రద్దు చేయాలని నినాదాలు చేశారు.

ప్రజాభిప్రాయ సేకరణ వద్ద మోహరించిన పోలీసులు

జమిలితో ప్రజాస్వామ్యానికి ముప్పు

- అవినీతిలో గత ప్రభుత్వంతో పోటీ
- బహిరంగ సభలో వి. ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం
- ఉత్సాహంగా తూర్పు గోదావరి జిల్లా మహాసభ ప్రారంభం

మున్సిపల్ స్టేడియం నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకు ప్రదర్శన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జమిలి ఎన్నికలతో ప్రజాస్వామ్యానికి ముప్పు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా 24వ జిల్లా మహాసభ రాజమహేంద్రవరంలో శనివారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా కోటిపల్లి బస్టాండ్ వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సభనుద్దేశించి వి.ఉమామహేశ్వరరావు మట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం లౌకిక తత్వం వైపా? సనాతన ధర్మం వైపా? అని సూటిగా ప్రశ్నించారు. సనాతన ధర్మం కోసం అంటూ ర్యాలీ చేపట్టనున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. చాతుర్వర్ణ వ్యవస్థను సమర్థిస్తారా..? అని ప్రశ్నించారు. పోలవరం-అమరావతి రెండు కళ్లు అంటూ చెబుతున్న చంద్రబాబు.. నిధుల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదన్నారు. అదాని, పోస్కో కంపెనీలకు విశాఖ ఉక్కును కట్టబెట్టే ప్రయత్నాన్ని ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి విధానాల ఫలితంగా భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ కొనుగోళ్లలో అవినీతికి పాల్పడిందని చెబుతున్న టిడిపి కూటమి ప్రభుత్వం, ఆ ఒప్పందాలను రద్దు చేసి నిందితులపై కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. 2024 ఎన్నికల ముందు చంద్రబాబు చేసిన వాగ్దానాలు గడిచిపోయి ఆరు నెలలైందన్నారు. పింఛన్ల పెంపు మినహా మిగిలిన ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదన్నారు. ఉచిత ఇసుక, మద్యం పాలసీ చాటున అవినీతికి తెరలేపారని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ ఇచ్చిన హామీని పూర్తిగా బుట్టదాఖలు చేశారన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత మూడుసార్లు పోలవరం పర్యటనకు చంద్రబాబు వచ్చారని గుర్తు చేశారు. 2027 నాటికి పూర్తి చేస్తామంటూ హామీ ఇస్తున్నారని, నిర్వాసితుల గురించి మాత్రం పెదవి విప్పడం లేదన్నారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ అవినీతితో పోటీ పడుతోందన్నారు. ఈ రెండు పార్టీలు రాష్ట్ర భవిష్యత్తుకు ప్రత్యామ్నాయం కాదని సిపిఎం ఒక్కటే ప్రత్యామ్నాయమని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించాలని, లేదంటే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎర్రకాలువ ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అనంతరం రౌతు తాతాలు కల్యాణ మండపంలో ప్రతినిధుల సభ ప్రారంభమైంది.

ఆకట్టుకున్న ప్రదర్శన

తొలుత వందలాది మంది కార్యకర్తలు మున్సిపల్ స్టేడియం నుంచి తాడితోట సెంటర్, మెయిన్‌రోడ్డు మీదుగా కోటిపల్లి బస్టాండ్ వరకూ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. 24వ మమాసభ అద్దం పట్టేలా 24 భారీ ఎర్ర జెండాలతో రెడ్ షర్ట్ వలంటీర్లు చేపట్టిన కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన గీతాలు ప్రజలను ఆలోచింపజేశాయి. తీన్‌మార్ డప్పులు ఉత్సాహాన్ని నింపాయి.

మేము ఏం చెబితే అది చేయాలి

- సచివాలయం మహిళా కానిస్టేబుల్‌పై టిడిపి నాయకుడి దాడి

ప్రజాశక్తి - వీరులపాడు (కృష్ణా జిల్లా)

'ప్రభుత్వం మాది... మేము ఏం చెబితే ఉద్యోగులు అది చేయాలి లేకపోతే మీ అంతు చూస్తాం' అంటూ సచివాలయ మహిళా పోలీస్‌పైన టిడిపి నాయకుడు దాడికి పాల్పడ్డాడు.. బాధితురాలి సమాచారం మేరకు... ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామ సచివాలయంలో మహిళా కానిస్టేబుల్‌గా అనూష విధులు నిర్వహిస్తునారు. తన ఇంటి సమీపంలో చెత్త వేస్తున్నారని దానిని తొలగించాలని గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు పానకాల ప్రసాదు గ్రామపంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశాడు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, అనూష కలిసి ప్రసాద్ ఇంటి వద్ద చెత్తను తొలగించి శుభ్రం చేయించేందుకు వెళ్లారు. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో శనివారంలోగా చెత్త తొలగిస్తామని చెప్పారు. శనివారం ఉదయం అనూషకు ప్రసాద్ ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించాడు.

అనంతరం సచివాలయం వద్దకు వచ్చి దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ జి అనిల్ అనూష నుంచి వివరాలు సేకరించి ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలోనూ ఓ దళిత మహిళపై ప్రసాద్ దాడి చేశాడని, తనకు న్యాయం చేయాలని బాధితురాలు అనూష కోరారు.

కళాకారుల నృత్య ప్రదర్శన

అలరిస్తున్న నృత్యాలు

ప్రజాశక్తి-చల్లపల్లి (కృష్ణా జిల్లా)

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళా పీఠం, కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్ సొసైటీ సంయుక్తంగా కృష్ణా జిల్లా మొవ్వ మండలంలో నిర్వహిస్తున్న కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలలో భాగంగా రెండవ రోజైన శనివారం ప్రదర్శించిన నృత్యాంశాలు ఆహూతులను అలరించాయి. ఇందిరా పరాశరం విద్యార్థులతో రంగపూజ నిర్వహించి హైందవీయం (నృత్యరూపకం)లో కూచిపూడి ప్రాధాన్యత భారతీయ సంస్కృతి సంప్రదాయాలను గురించి తెలియజేసే పాటను ప్రదర్శింపజేశారు. నాట్యరత్న మాడభూషిని రమణ సిద్ధి జగదానందకారక (నాటరాగం ఆదితాళం) అంశాన్ని ప్రదర్శించారు. సాహితీ నారాయణియం (రాగమాలిక, ఆదితాళం) అంశాన్ని, ప్రఖ్య కొలువిదే గణపతి. (లలితరాగం, ఆదితాళం, శివతాండవం, రాగమాలిక, దితాళం.) ప్రదర్శించారు. యక్షగాన కంఠీరవ పసుమర్తి శేషుబాబు బందం శ్రీరామ నాటకం కూచిపూడి యక్షగానం ప్రదర్శించారు. చావలి బాలా త్రిపుర సుందరి శిష్య బృందం డాక్టర్ వెంపటి చిన సత్యం కొరియోగ్రఫీలో రూపొందిన క్షీరసాగర మథనం నృత్య రూపకం ప్రదర్శించారు. వైజయంతి కాశీ బృందం దేహం దేవాలయ ప్రోక్తం, (రాగమాలిక, ఆదితాళం.) పూతన ప్రవేశ (రాగమాలిక ఆదితాళం) అంశాన్ని ప్రదర్శించారు.

అధికారులపై దాడులు సహించబోం

- గాలివీడు ఎంపిడిఒను పరామర్శించిన డిప్యూటీ సిఎం పవన్
- రైతు కుటుంబం ఆత్మహత్యపై నివేదికకు ఆదేశం

ఆస్పత్రిలో ఎంపిడిఒను పరామర్శిస్తున్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి, గాలివీడు

టిడిపి కూటమి సర్కారులో విధులు నిర్వహిస్తున్న అధికారులపై దాడులకు పాల్పడితే సహించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు. కడప జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపిడిఒ జవహర్‌బాబును శనివారం ఆయన పరామర్శించారు. అనంతరం దాడి ఘటనకు దారి తీసిన పరిణామాలను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, భయపడొద్దని భరోసానిచ్చారు. అనంతరం మీడియాతో పవన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో వైసిపి 11 సీట్లకే పరిమితమైనప్పటికీ ఆధిపత్యం, అహంకార పూరిత ధోరణి తగ్గలేదని, ఎలా తగ్గించాలో ఆలోచిస్తామని తెలిపారు. వైసిపి కేడర్‌ను అదుపులో ఉంచుకోవాలని ఆ పార్టీ అధ్యక్షులు జగన్‌కు పరోక్షంగా చురకలంటించారు. గతంలో ప్రతాప్, శేఖర్‌నాయక్, శ్రీనివాసులరెడ్డి అనే ఉద్యోగులపై దాడులు చేశారని, తాజాగా దళిత అధికారి ఎంపిడిఒ జవహర్‌బాబుపై దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి అధికారులపై దాడులు చేస్తే ఉపేక్షింబోమని తెలిపారు. దాడి ఘటనతో సంబంధం కలిగిన మిగిలిన తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని విచారించాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. రాయలసీమ ఎవరి జాగీరు కాదని, రౌడీమూకల ఆటకట్టిస్తానని, అవసరమైతే ఇక్కడే పార్టీ ఆఫీసు పెట్టి, మకాం వేస్తానని హెచ్చరించారు.

పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం దిద్దేకుంటకు చెందిన నాగేంద్ర అనే రైతు కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం దారుణమని తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలను అన్వేషించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆత్మహత్యకు గల కారణం మ్యుటేషన్‌కు సంబంధించిన వ్యవహారమా, లేక అప్పులబాధ ఏమైనా ఉందా, లేక ఇతరుల ప్రమేయం ఏమైనా ఉన్నదా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అన్నమయ్య జిల్లాలోని గాలివీడు ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఇది సందర్భం కాదు

జిల్లాలో ఓ రైతు కుటుంబం ఆత్మహత్య, దళిత ఎంపిడిఒపై దాడి జరిగిందని, వీటి గురించి మాట్లాడాలని, సినిమా గురించి మాట్లాడే సందర్భం ఇది కాదని పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు పవన్ సమాధానమిచ్చారు.

ఎంపిడిఒపై దాడి చేసిన వారిపై హత్య కేసు నమోదు

ఎంపిడిఒ జవహర్‌బాబుపై దాడికి పాల్పడిన సుదర్శన్‌రెడ్డిపై హత్యాయత్నం, ఎస్‌సి, ఎస్‌టి కేసును గాలివీడు పోలీసులు నమోదు చేశారు. ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ.. సుదర్శన్‌రెడ్డి, గడ్డం చంద్రప్రకాష్‌రెడ్డి, జెసిపి రమణారెడ్డి, వెంకటరెడ్డి, భానుమూర్తిరెడ్డి, నూలివీడు రామానుజన్‌రెడ్డి, గరుగుపల్లి రామానుజన్‌రెడ్డి, తూముకుంట ఆంజనేయులురెడ్డి, తూముకుంట పాపిరెడ్డిగారిపల్లి చెందిన బయ్యారెడ్డి, తుమ్ముకుంట మరికుంటపల్లికి చెందినబయారెడ్డి, ధనుంజయ రెడ్డి, రెడ్డిశేఖర్, సి.ప్రభాకర్, ధర్మారెడ్డిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

కేసు కొట్టేయండి

- మంత్రి నిమ్మల పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

తనపై గతంలో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి కేసు ప్రొసీడింగ్స్‌ను కొట్టేయాలంటూ మంత్రి నిమ్మల రామానాయుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై నమోదైన కేసులో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారని, ఏలూరు ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరించిందని, ఆ ప్రొసీడింగ్స్‌ను కొట్టేయాలని కోరారు. వ్యక్తిగత హాజరుతో సహా తదుపరి చర్యలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కూడా కోరారు. పాలకొల్లులో 2022లో నాటి ప్రభుత్వం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహిస్తే నిమ్మలతోపాటు మరో పాతికమంది వేదికపైకి దూసుకొచ్చి వైసిపి కార్యకర్తలను దూషించి దాడి చేశారని అభియోగం. వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు బండి రమేష్ చేసిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు 2022 ఆగస్టు 5న కేసు నమోదు చేశారు. ఏలూరులోని ప్రత్యేక కోర్టు తనను ప్రాసిక్యూట్ చేయాలని పేర్కొనడాన్ని నిమ్మల తప్పుపట్టారు. ఆ కేసు ప్రొసీడింగ్స్ నిలిపివేయాలని కోరారు.

ప్రతిభ వెలికితీసేందుకే బాలోత్సవాలు

- పిల్లల పండుగల్లో పలువురు వక్తలు
- భీమవరం, పల్నాడు, తిరుపతి బాలోత్సవాలు ప్రారంభం

పల్నాడు బాలోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకు బాలోత్సవాలు దోహదం చేస్తాయని పలువురు వక్తలు అన్నారు. పిల్లలను ప్రోత్సహించేందుకు, వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు భీమవరం, పల్నాడు, తిరుపతి బాలోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని చింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూల్లో భీమవరం బాలోత్సవం రెండో పిల్లల పండుగను పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలను వీడి శాస్త్రీయతపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ప్రతిఒక్కరూ దేశభక్తి భావన కలిగి ఉండాలన్నారు. అమరావతి బాలోత్సవం ముఖ్య నిర్వాహకులు స్వరూపరాణి మాట్లాడుతూ బాల, బాలికల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు బాలోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. అనంతరం చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి నృత్యంతోపాటు పలు రకాల ఆట పాటలతో తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి, డిఎన్ఆర్ కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు పాండురంగరాజు, బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాద్‌రాజు, సభ్యులు సిహెచ్.పట్టాభిరామయ్య, గాతల జేమ్స్, జి.ధనుష్ పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా నరసరావుపేటలోని పాలడుగు నాగయ్య చౌదరి, కొత్త రఘురామయ్య కళాశాలలో ప్రారంభమైన పల్నాడు బాలోత్సవం అట్టహాసంగా ప్రారంభమైంది. పల్నాడు బాలోత్సవం కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. పిల్లల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఉద్యమంలా బాలోత్సవాలు నిర్వహించాలని తెలిపారు. నేటి ఆధునిక యుగంలో చిన్నారులు కంప్యూటర్, టివి, సెల్‌ఫోన్లకు ఆకర్షితులై యాంత్రికంగా తయారవుతున్నారన్నారు. మార్కులు, ర్యాంకులే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పిల్లలు భాగస్వాములు కావాలని, అప్పుడే వారిలో మానసిక పరిపక్వత వస్తుందని తెలిపారు. ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు పల్నాడు బాలోత్సవం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విజయవాడ ఎంబివికె ప్రధాన కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బాలల అకాడమీ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, బాలోత్సవ గౌరవాధ్యక్షులు ఎంఎస్ఆర్‌కె ప్రసాద్, పల్నాడు విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు కామినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలోని జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రారంభమైన తిరుపతి బాలోత్సవంలో ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి కెఎల్ఎన్ కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త, కస్తూర్బా గాంధీట్రస్ట్ చైర్మన్ పిసి రాయులు హజరయ్యారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కెఎల్ఎన్ కుమార్, పిసి రాయులు మాట్లాడుతూ.. బాలోత్సవం వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, నాయకత్వ లక్షణాలు అలవడతాయని తెలిపారు. రోటరీ క్లబ్ తిరుపతి శాఖ అధ్యక్షులు సోము రవికుమార్ మాట్లాడుతూ.. పిల్లలకు విద్యతోపాటు మన సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అనంతరం ఆరు వేదికల ద్వారా 30 అంశాల్లో 70 విభాగాల్లో పలు రకాల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ అధ్యక్షులు టెంకాయల దామోదరం, కార్యదర్శి మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ, గీతా బాల సుబ్రమణ్యం, సోమయ్య, పయ్యావుల గురున్నాదం, మల్లేశ్వరరావు, ఓవి రమణ పాల్గొన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్‌లో మళ్లీ విఆర్‌ఎస్

- 19వేల మంది ఉద్యోగులపై వేటు..!

న్యూఢిల్లీ : దేశంలోని దిగ్గజ ప్రయివేటు టెల్కోలకు ఇటీవల తీవ్ర పోటీని ఇస్తోన్న బిఎస్‌ఎన్‌ఎల్‌ను మళ్లీ నీరుగార్చడానికి.. ఆ సంస్థలోని వేలాది ఉద్యోగులను ఇంటికి పంపే కుట్ర జరుగుతోందని సమాచారం. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బిఎస్‌ఎన్‌ఎల్ బోర్డు స్వచ్ఛంద పదవీ విరమణ ప్రణాళిక (విఆర్‌ఎస్)ను రూపొందిస్తోందని సమాచారం. విఆర్‌ఎస్ 2.0 ద్వారా దాదాపు 18,000 నుండి 19,000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ.1,500 కోట్లు వ్యయం చేయనుందని సమాచారం. దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాలు, గ్రామాలలో 4జి వంటి అధునాతన నెట్‌వర్క్ టెక్నాలజీని ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న బిఎస్‌ఎన్‌ఎల్.. తక్కువ టారీఫ్‌లతో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలకు తీవ్ర పోటీని ఇస్తోంది. ఈ క్రమంలో ఉద్యోగుల తొలగింపుతో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకోనున్నాయే వేచి చూడాలి.

విఆర్‌ఎస్ ప్రతిపాదనకు సోమవారం బిఎస్‌ఎన్‌ఎల్ బోర్డు అమోదం తెలిపిందని రిపోర్టులు వస్తోన్నాయి. దీనికి టెలికమ్యూనికేషన్ శాఖ డిఒటి ఆమోదాన్ని కోరింది. డిఒటి అనంతరం ఈ ప్రతిపాదనను ఆర్థిక మంత్రిత్వ శాఖ అంగీకరిస్తే.. ఆ తర్వాత కేంద్ర కేబినెట్ కూడా ఆమోదించాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా 4జి సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ముందే ఖర్చులు తగ్గించుకునే చర్యలు చేపడుతోన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. కాగా.. విఆర్‌ఎస్ ప్లాన్‌పై ఇంకా అంతర్గతంగానే చర్చలు జరుగుతున్న బిఎస్‌ఎన్‌ఎల్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

తాజా తొలగింపులు బిఎస్‌ఎన్‌ఎల్ మానవ వనరుల నిర్వహణకు సంబంధించిన ఖర్చులో 38 శాతం వరకు తగ్గనుందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం శ్రామిక శక్తి నిర్వహణ కోసం ఏడాదికి సుమారు రూ.7,500 కోట్లు ఖర్చు చేస్తోంది. తాజా ప్రతిపాదనతో రూ.5,000 కోట్ల వరకు తగ్గించాలని లక్ష్యం. ఆర్థిక సంవత్సరం 2023-24లో బిఎస్‌ఎస్‌ఎల్ ఆదాయం రూ.21,302 కోట్లుగా ఉంది. గత సంవత్సరం రూ.20,699 కోట్లతో పోలిస్తే పెరిగింది. ప్రస్తుతం సంస్థలో మొత్తం 55,000 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 25,000 మంది ఎగ్జిక్యూటివ్ స్థాయి ఉద్యోగులు కాగా 30,000 మంది నాన్ ఎగ్జిక్యూటివ్‌లుగా పని చేస్తున్నారు.

ఈ ఏడాది జూన్‌లో ప్రయివేటు టెల్కోలు భారీగా టారీఫ్‌లు పెంచడంతో వినియోగదారులు బిఎస్‌ఎన్‌ఎల్ వైపు మొగ్గు చూపుతున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ టెల్కో రీఛార్జ్ ప్లాన్ల ధరలు తక్కువగా ఉండటంతో బిఎస్‌ఎన్‌ఎల్ వైపు మళ్లుతున్నారు. అయితే బిఎస్‌ఎన్‌ఎల్ ఇంకా పూర్తి స్థాయిలో 4జి సేవలు తీసుకురావాల్సి ఉంది. అలాగే 5జి సేవలను కూడా ప్రారంభించాల్సి ఉంది. ఈ ఏడాది రిలయన్స్ జియో తొలుత భారీగా టారీఫ్‌లను పెంచడం.. ఆ బాటలోనే భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు 27 శాతం వరకు టారీఫ్‌లను పెంచేశాయి. ఈ దెబ్బతో అక్టోబర్ నెలలో బిఎస్‌ఎన్‌ఎల్ కొత్తగా మరో 5 లక్షల మంది ఖాతాదారులు చేరారు. ఇంతక్రితం సెప్టెంబర్‌లో కూడా 8.5 లక్షల ఖాతాదారులను జోడించుకుంది. ఆగస్టులో 25.3 లక్షల మంది, అంతక్రితం నెల జులైలోనూ 29.3 లక్షల మంది కొత్తగా వచ్చి చేరారు. నాలుగు మాసాల్లో బిఎస్‌ఎన్‌ఎల్ 68 లక్షల పైనా ఖాతాదారులను ఆకర్షించింది. టెలికం దిగ్గజం రిలయన్స్ జియో అక్టోబర్‌తో ముగిసిన నాలుగు మాసాల్లో మొత్తంగా 1.65 కోట్ల ఖాతాదారులను పోగొట్టుకుంది. దీంతో 39.9 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది. ఎయిర్‌టెల్ 33.50 శాతం, వొడాఫోన్ ఐడియా 18.30 శాతం, బిఎస్‌ఎన్‌ఎల్ 8.50 శాతం వాటాను కలిగి ఉన్నాయి.


గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో అథ్లెటిక్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

వయస్సుకు రిటైర్మెంట్ లేదని, వృద్ధులైనా యువకుల్లా క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనడం హర్షణీయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గుంటూరు ఎన్‌టిఆర్ స్టేడియంలో రెండు రోజులపాటు జరగనున్న ఆంధ్రప్రదేశ్ 6వ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలను గుంటూరు పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శనివారం ప్రారంభించారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లు హై జంప్, లాంగ్ జంప్ పోటీల్లో పాల్గొన్నారని, వారిని చూసి యువత స్ఫూర్తి పొందాలని కోరారు. క్రీడల ద్వారా శారీరక దఢత్వం కలిగి ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉంటారన్నారు. క్రీడా పోటీలను పండుగ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేసేందుకు, రెండు రోజులు ఎపి మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షేక్ లాల్ వజీర్, కమిటీ సభ్యులు శ్రమిస్తూ పోటీల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారని, ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోటీలో పాల్గొన్న 92 ఏళ్ల వృద్ధుడు, వృద్ధురాలని శాలువాతో ఎమ్మెల్యే మాధవి సత్కరించారు.

చిన్న నగరాల్లో ఛార్జింగ్ సదుపాయాలపై దృష్టి

- టాటా ఇవి వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణీ నగరాల్లో ఇవి ఛార్జింగ్ మౌలిక సదుపాయాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు టాటా ఇవి వెల్లడించింది. ఇందుకోసం వాటాదారులతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలిపింది. ఇవి చార్జింగ్ మౌలిక సదుపాయాల ఏర్పాటు, వేగవంతం కోసం ఆరు చార్జ్ పాయింట్ ఆపరేటర్లు (సిపిఒ)లు, రెండు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో ఇప్పటికే భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. వినియోగదారుల అవసరాల ప్రాధాన్యత నేపథ్యంలో ఇవి చార్జింగ్ మౌలికసదుపాయాల్లో పెట్టుబడులు పెడుతోన్నట్లు పేర్కొంది.

దొంగతనం కేసు పక్కదారి

- డిజిపికి ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో టిటిడి పరకామణి హుండీ లెక్కింపులో ఓ వ్యక్తి దొంగతనం చేసి విజిలెన్స్ అధికారులకు దొరికిపోయాడని, రికవరీ చేయాల్సిన అధికారులు కేసును పక్కదారి పట్టించారని టిటిడి బోర్డు మెంబరు భాను ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఈ అంశంపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన, బిజెపి రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం, నేతలు జయప్రకాష్, షేక్ బాజీతో కలిసి విచారణ కమిషన్ వేయాలని కోరుతూ డిజిపి ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు.

హేతువాదం, మానవవాదంతోనే ఐక్యత, సమానత్వం

- ఫిరా 13వ జాతీయ సమ్మేళనంలో వక్తలు

తిరుచ్చి : హేతువాద దక్పథం, మానవవాదం ద్వారానే ప్రజల మధ్య శాంతి, ఐక్యత, సమానత్వం సాధ్యమని, కానీ బిజెపి పాలనలో ఒకే దేశం, ఒకే మతం, ఒకే భాష పేరుతో ప్రజల మధ్య విభేదాలు సష్టిస్తున్నారని పెరియార్ ఉద్యమ వారసులు, హేతువాద ఉద్యమ ప్రముఖులు కె.వీరమణి విమర్శించారు. దేశంలో హేతువాద ఉద్యమాన్ని నడిపించిన పెరియార్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భారత నాస్తిక, హేతువాద సంఘాల సమాఖ్య (ఫిరా) 13వ జాతీయ సమ్మేళనం తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి పట్టణం పెరియార్ శతాబ్ది విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం ప్రారంభమైంది. ఈ సమ్మేళనంలో వీరమణి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ లౌకిక, రాజ్యాంగ హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. ఫిరా జాతీయ అధ్యక్షులు నరేంద్ర నాయక్, ప్రధాన కార్యదర్శి సుదేష్ గోడేరావు మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాల నిర్మూలన, శాస్త్రీయ దక్పథం కల్పించే బాధ్యతపై రాజ్యాంగంలో ఆర్టికల్ 51ఏ (హెచ్)లో పొందుపరిచారని తెలిపారు. దాన్ని కాలరాస్తూ ప్రశ్నించే గొంతుకలు, హేతువాదులు, జర్నలిస్టులపై అక్రమ నిర్బంధంపై ప్రయోగిస్తున్నారని, హత్యలు కూడా చేస్తున్నారని వివరించారు. సనాతన ధర్మం పేరుతో సమాజంలో అశాస్త్రీయ భావజాలాన్ని, సుడో సైన్స్‌ను ముందుకు తెస్తున్నారని విమర్శించారు. ఈ సమ్మేళనానికి వివిధ రాష్ట్రాల్లో ఉన్న నాస్తిక కేంద్రం, మహారాష్ట్ర అంధ శ్రద్ధ నిర్మూలన సమితి, హేతువాద సంఘం, నాస్తిక సమాజం, జెవివి వంటి సంస్థల నుండి 700 మంది ప్రతినిధులు హాజరయ్యారు. తమిళ లోక్‌సభ సభ్యులు షణ్ముగం, తమిళ హేతువాద సంఘం అధ్యక్షులు మహాసభ నిర్వహణ కన్వీనర్ ఆర్ తమిళ్ సెల్వన్, సందేశం ఇచ్చారు.

కేసుల రాజీ పత్రాలపై కక్షిదారుల ఫొటోలు

ప్రజాశక్తి-అమరావతి

కేసుల రాజీ కోసం లోక్ అదాలత్‌లను ఆశ్రయించే వాళ్లల్లో కొందరు మోసాలకు పాల్పడుతున్న ఘటనల నేపథ్యంలో హైకోర్టు కట్టడి చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇకపై రాజీ పత్రాలపై కేసులోని ఇరుపక్షాల కక్షిదారుల ఫొటోలను అతికించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఉన్న వాటినే లోక్ అదాలత్‌లు అనుమతించాలంది. కోర్టులో కేసు విచారణ జరిగినప్పుడు ఉన్న న్యాయవాది, లోక్ అదాలత్‌లో కేసు రాజీకి హాజరయ్యే న్యాయవాది ఒకరేనా కాదో అనేది కూడా లోక్ అదాలత్ పరిశీలన చేయాలంది. ఒకవేళ న్యాయవాది అందుబాటులో లేనప్పుడు లేదా లోక్ అదాలత్‌కు రావడానికి ఆసక్తి లేనప్పుడు రాజీపై సంతకాలు చేసే కక్షిదారులను గుర్తింపు కోసం లోక్ అదాలత్ తగిన చర్యలు తీసుకోవచ్చునని చెప్పింది. ఒక కేసులో న్యాయవాది సంతకం లేకుండానే లోక్ అదాలత్ అవార్డు ఇవ్వడాన్ని రద్దు చేస్తూ పైవిధమైన కీలక షరతులు విధిస్తూ న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ ఎన్ హరినాథ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పింది. ఆస్తిపై హక్కును పెద్ద కుమారుడికి వదిలేసేలా తండ్రి పుల్లారావు లోక్ అదాలత్‌లో గతేడాది రాజీ చేసుకున్నారు. విదేశాల్లో ఉండే మూడో కొడుకు శరత్‌బాబు జిపిఎ ద్వారా హైకోర్టులో సవాల్ చేశారు. కింది కోర్టులో తన తండ్రి న్యాయవాది సంతకానికి, లోక్ అదాలత్ అవార్డుపై తన తండ్రి న్యాయవాది సంతకాలకు వ్యత్యాసం ఉందన్న వాదనను ఆమోదించింది. తండ్రి, ఆయన న్యాయవాది ఇద్దరూ చనిపోయిన కారణంగా వాళ్ల సంతకాల జోలికి వెళ్లడం లేదని హైకోర్టు స్పష్టం చేసింది.

సంపాదకీయం

మ్యాజిక్ ఆఫ్ బుక్స్

"ది జాయ్ ఆఫ్ రీడింగ్: సెలబ్రేటింగ్ ది మ్యాజిక్ ఆఫ్ బుక్స్"...పుస్తక మహోత్సవానికి ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ఇచ్చిన క్యాప్షన్ ఇది. చదవడంలోని ఆనందాన్ని, పుస్తకంలోని మ్యాజిక్‌ని సంబరం చేసుకోమంటున్నది ఏఐ. పుస్తకం...పఠనం మానవ వికాసానికి, విజ్ఞానానికి ఆధారం. 'చదవడం ఒక సంభాషణ. అన్ని పుస్తకాలు మనతో మాట్లాడతాయి. కాని, మంచి పుస్తకం వింటుంది కూడా' అంటారో రచయిత. శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో, మనసుకు చదవడం అంత అవసరం. 'సంస్కృతిని నాశనం చేయడానికి మీరు పుస్తకాలను కాల్చాల్సిన అవసరంలేదు. వాటిని చదవడం మానేయండి' అంటాడు రచయిత రే బ్రాడ్‌బరీ. సంస్కృతి వికాసంలో పుస్తకం నిర్వహించే భూమిక ఎంత కీలకమైనదో దీన్నిబట్టే అర్థమౌతుంది. గతంలో ప్రయాణాల్లో, తీరిక సమయాల్లో చదువొచ్చిన ఎవరి చేతిలో చూసినా పుస్తకం కనిపించేది. నట్టింటిలోకి నడిచొచ్చిన టీవీ... పుస్తకం పట్టుకోకుండా చేస్తే, ఆ తర్వాత వచ్చిన మొబైల్... పుస్తక పఠనాన్ని దూరం చేసింది.

ప్రతిరోజూ కనీసం ఆరు నిమిషాల పాటు పుస్తకం చదివితే చాలు, హృదయ స్పందనతో పాటు కండరాలపై ఒత్తిడి 60శాతం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఒత్తిడిని ఎదుర్కోవడానికి టీ, కాఫీ తాగడం, నడక వంటివి చేస్తుంటారు. వీటన్నింటికంటే శ్రేష్టమైనది, ఆరోగ్యకరమైనది పుస్తకపఠనం అని యుకెలోని 'ససెక్స్' యూనివర్శిటీ గతంలో నిర్వహించిన ఒక సర్వేలో వెల్లడైంది. రక్తపోటు, హృదయ స్పందనరేటు, మనోవేదన, ఒత్తిడి వంటివి పుస్తక పఠనం ద్వారా తగ్గుతాయని అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్ పరిశోధన వెల్లడించింది. పుస్తకం ఏదైనా కావొచ్చు. పఠనం మెదడుకు ఔషధం అని మానసికవేత్తలు చెబుతున్నారు. 'పుస్తకం దీపంలా వెలుగునిచ్చి, మనోమాలిన్యమనే చీకటిని తొలగిస్తుంది" అంటారు అంబేద్కర్. అంతేకాదు... పుస్తకాలు చదవని వారితో పోల్చితే... చదివేవారు మెరుగైన ప్రతిభ కలిగివుంటారని బ్రిటన్‌లోని నేషనల్ లిటరసీ ట్రస్ట్ సర్వే తేల్చింది. అమెరికా, న్యూజిలాండ్, ఫిన్లాండ్, ఇంగ్లాండ్, కెనడా, సింగపూర్ వంటి దేశాలలో ఎన్ని పుస్తకాలు చదివామో చెప్పుకోవడం గొప్పతనంగా భావిస్తారు. వారి స్కూళ్లలో బోధనతోపాటు పుస్తక పఠనం ఒక పాఠ్యాంశంగా వుంటుంది. తల్లిదండ్రులు రోజూ కొంత సమయం పుస్తకాలు చదవడానికి కేటాయిస్తే... పిల్లలు వారిని అనుసరిస్తారు. ఖాళీ సమయాల్లో పిల్లలను పుస్తకాల షాపులకు, పుస్తక ప్రదర్శనలకు, గ్రంథాలయాలకు, పుస్తక ఆవిష్కరణ సభలకు తీసుకెళుతుండటం వలన, పిల్లల్లోనూ పుస్తకాలు చదవాలన్న జిజ్ఞాస పెరుగుతుంది.

'చదువని వాడజ్ఞుండగు/ చదివిన సదసద్వివేక చతురత గులుగున్!' అంటాడు పోతన. పుస్తక పఠనం పెంచుకోవాలన్న నిర్ణయం తీసుకోడానికి ఇదొక సందర్భం. 35వ పుస్తక మహోత్సవం విజయవాడ వేదికగా జనవరి 2 నుంచి 12 వరకూ జరగనుంది. సంక్రాంతికి ముందొచ్చే అతి పెద్ద పండుగ ఈ పుస్తక మహోత్సవం. 11రోజుల పాటు 200 స్టాళ్లకు పైగా ఏర్పాటు చేసిన ఈ మహోత్సవంలో 10లక్షల మందికి పైగా పుస్తక ప్రియులు పాల్గొంటారని అంచనా. పుస్తక సాంగత్యం పెంచుకోవడం ద్వారా విజ్ఞానం, మానసిక వికాసం అలవడుతుంది. 'పుస్తకాలు లేని ఇల్లు, ఆత్మలేని శరీరం లాంటిది' అంటాడు సిసిరో. డిజిటల్ పుస్తకాలొచ్చిన తర్వాత మామూలు పుస్తకాలకు కాలం చెల్లింది అనుకునే వారూ లేకపోలేదు. సాంకేతికత ఉచ్ఛస్థితిలో వున్న దేశాల్లో సైతం పుస్తక అమ్మకాలు పెరుగుతుండడం, ప్రపంచవ్యాప్తంగా బుక్ ఫెయిర్‌లు జరుగుతుండట పుస్తకాదరణకు నిదర్శనం. డిజిటల్ కంటే పుస్తక స్పర్శలోని అనుభవం గొప్పగా వుంటుంది. పుస్తకంలోని మ్యాజిక్ అదే. పుస్తకాలు, అక్షరాలు లేకుంటే మానవ విజ్ఞానం ఎలా వుండేది? అందుకే... నచ్చిన, మెచ్చిన, ప్రభావితం చేసిన పుస్తకం కొనుక్కోవాలి. ఈ కొత్త సంవత్సరాన్ని పుస్తక పఠనంతో ప్రారంభించేందుకు పూనిక తీసుకోవాలి. పిల్లల్ని ఈ పుస్తక మహోత్సవానికి తీసుకురావడం అంటే... వారిలో పుస్తకాల పట్ల, పఠనం పట్ల ఆసక్తిని పాదుకొలిపే ఒక సదవకాశంగా భావించాలి. పుస్తకాల అడుగుజాడల్లో పిల్లల్ని అక్షరాలా నడపాలి. ఈ అడుగులే వారి భవితకు సోపానంగా మారతాయి.

మహనీయుల మాట

మన లక్ష్యం కేవలం ప్రైవేట్ ఆస్తిలో మార్పులు తీసుకురావడం కాదు. దానిని రద్దు చేయడం. వర్గ వైరుధ్యాలను కప్పిపుచ్చడం కాదు, వర్గాలను రద్దు చేయడం. ప్రస్తుత సమాజానికి మెరుగులు దిద్దడం కాదు. కొత్త సమాజాన్ని నిర్మించడం.

- కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్

మన్మోహన్ వ్యక్తిత్వం, లౌకిక నిబద్ధత

ప్రస్తుతం

తెలకపల్లి రవి

రాజకీయ విభేదాలను మించి అసహన దూషణలు తాండవిస్తున్న ఈ రోజుల్లో కూడా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు దేశం ఏకోన్ముఖంగా జోహారులర్పించింది. ఆయనను పితామహుడుగా చెప్పే సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) విధానాలతో గట్టిగా విభేదించి పోరాడే వామపక్షాలు కూడా ఆయన లౌకిక నిబద్ధతను గౌరవించాయి. దేశానికి మేలు చేసేవిగా తను నమ్మిన విధానాలనే ఆయన అనుసరించారని, వ్యక్తిగా ఆయన నిబద్ధత ప్రశ్నించడానికి వీలు లేనిదని పేర్కొన్నాయి. ఆ కార్పొరేట్ విధానాలకు తన మత రాజకీయాలు జోడిస్తూ కాంగ్రెస్‌ను బద్ధ శత్రువుగా పరిగణించే బిజెపి నేతలూ ఆర్థిక రంగంలో మన్మోహన్ ముద్రను కీర్తిస్తున్నారు. ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు విధానాలు 'మన్మోహనామిక్స్' అనే పేరు పెట్టారు గాని నిజానికి వాటిని స్పష్టమైన చారిత్రక నేపథ్యంలోనే చూడవలసి వుంటుంది. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమవడం, పివి నరసింహారావు ప్రధాని పదవి చేపట్టడం కాస్త అటూ ఇటూగా జరిగాయి. భారత పాలకవర్గాలు అప్పటివరకూ కొన్ని తేడాలతో అనుసరిస్తూ వచ్చిన అలీన, స్వావలంబన విధానాల నుంచి విడగొట్టు కోవడానికి సిద్ధమన్నారు. కార్పొరేట్ ప్రైవేటీకరణ విధానాల వైపు మరలే ఆ ప్రక్రియను అమలు చేయడానికి అటు పి.వి తో పాటు ఇటు మన్మోహన్ సరైన వ్యక్తిగా ఆ వర్గాలు భావించాయనేది నిర్వివాదాంశం.

ఆయనను పితామహుడుగా చెప్పే సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) విధానాలతో గట్టిగా విభేదించి పోరాడే వామపక్షాలు కూడా ఆయన లౌకిక నిబద్ధతను గౌరవించాయి. దేశానికి మేలు చేసేవిగా తను నమ్మిన విధానాలనే ఆయన అనుసరించారని, వ్యక్తిగా ఆయన నిబద్ధత ప్రశ్నించడానికి వీలు లేనిదని పేర్కొన్నాయి. ఆ కార్పొరేట్ విధానాలకు తన మత రాజకీయాలు జోడిస్తూ కాంగ్రెస్‌ను బద్ధ శత్రువుగా పరిగణించే బిజెపి నేతలూ ఆర్థిక రంగంలో మన్మోహన్ ముద్రను కీర్తిస్తున్నారు. ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా...ఆయన తీసుకున్న నిర్ణయాలు, విధానాలు 'మన్మోహనామిక్స్' అనే పేరు పెట్టారు గాని నిజానికి వాటిని స్పష్టమైన చారిత్రక నేపథ్యంలోనే చూడవలసి వుంటుంది. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమవడం, పి.వి. నరసింహారావు ప్రధాని పదవి చేపట్టడం కాస్త అటూ ఇటూగా జరిగాయి. భారత పాలకవర్గాలు అప్పటివరకూ కొన్ని తేడాలతో అనుసరిస్తూ వచ్చిన అలీన, స్వావలంబన విధానాల నుంచి విడగొట్టుకోవడానికి సిద్ధమన్నారు. కార్పొరేట్ ప్రైవేటీకరణ విధానాల వైపు మరలే ఆ ప్రక్రియను అమలు చేయడానికి అటు పి.వి తో పాటు ఇటు మన్మోహన్ సరైన వ్యక్తిగా ఆ వర్గాలు భావించాయనేది నిర్వివాదాంశం.

కీలక ఎంపిక

2004లో సోనియా గాంధీ ప్రధాని పదవి చేపట్టక పోవడం మంచిదని నిర్ణయించుకున్నాక ఆ స్థాయిలో విశ్వసనీయత, విషయజ్ఞత వున్న నేతగా మన్మోహన్‌నే ఎంచుకోవడానికి కూడా స్పష్టంగా ఇవే కారణమైనాయి. ఆనాడు లోక్‌సభలో 59 మంది సభ్యులు గల వామపక్షాల మద్దతు లేకపోతే యుపిఎ 1 సర్కారు ఏర్పాటే సాధ్యం కాదు. అలాంటి సర్కారుకు సారథ్యం వహించడమంటే భిన్న కోణాలను సమన్వయం చేయవలసి వుండేది. యుపిఎ1 మొదటి దశలో 11 అంశాల కనీస కార్యక్రమం ప్రకటించడం అలా జరిగిందే. గ్రామీణ ఉపాధి హామీ పథకం, అటవీ హక్కుల చట్టం, భూ సేకరణ చట్టం లాంటివి ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో రూపొందడానికి వామపక్షాల ఒత్తిడి కీలక పాత్ర వహించింది. వాటినే ఇప్పుడు ఆయన సానుకూల విజయాలుగా అభివర్ణించడం చూస్తున్నాం. అయితే చిల్లర వ్యాపారంలో విదేశీ కంపెనీలకు ద్వారాలు తెరవడం నుంచి అమెరికాతో పౌర అణు ఒప్పందంపై సంతకాలు చేయడం వంటివి వామపక్షాలు ఏ మాత్రం ఆమోదించలేదు. అలాగే తనను కోరితెచ్చుకున్న బలాఢ్య వర్గాల ప్రభావం బలమైంది గనక మన్మోహన్ సింగ్ వెనక్కు తగ్గలేదు. 2007 ఆగస్టు 7న టెలిగ్రాఫ్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏది ఏమైనా అణు ఒప్పందం తప్పదని, వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకుంటే కానివ్వండని తీవ్ర వ్యాఖ్యానం చేశారు. దాదాపు ఆ వెనువెంటనే ప్రకాశ్ కరత్, ఎ.బి.బర్ధన్‌ల ఉపసంహరణ ప్రకటన వెలువడింది.

1972లో ఆర్థిక సలహాదారుగా, అంతర్జాతీయ వేదికల్లో భారత ప్రతినిధిగా, ప్రపంచ బ్యాంకులో కీలక అధికారిగా, రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షుడుగా అనేక విధాల బాధ్యతలు నిర్వహించిన మన్మోహన్‌కు దేశ విదేశీ పాలక వర్గాల ఆర్థిక నీతి బాగా తెలుసు. రాజకీయ విధానాల మూలాలు ఆర్థిక శాస్త్రంలో నిర్ణయమవుతాయనీ తెలుసు. సోవియట్ అనంతర ప్రపంచ పరిణామాలపై పాలక వర్గాల కోణం ఏమిటో ఆయనకు పూర్తి అవగాహన వుంది. రాజీవ్ గాంధీ దారుణ హత్య తర్వాత అనూహ్య పరిస్థితుల్లో పివి నరసింహారావు ప్రధాని అవడం, తనను ఆర్థిక మంత్రిగా ఎంపిక చేయడం వెనక వున్న బలీయమైన జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ వర్గాల పట్టు కూడా ఆయనకు పూర్తిగా తెలుసు. ఆర్థికమంత్రిగా ఇన్ని తీవ్ర నిర్ణయాలు ఎలా తీసుకున్నారంటే ఎప్పుడూ జేబులో రాజీనామా లేఖ పెట్టుకుని తిరిగేవాడినని చెప్పగలిగారంటే అందుకు కారణం ఆ వర్గాలే.

యుపిఎ 2 కష్టాలు

అణు ఒప్పందంపై తీవ్ర చర్చ తర్వాత టిడిపి తదితర పార్టీలను చీల్చి, ఎస్‌పిని తమ వైపు తిప్పుకుని యుపిఎ గట్టెక్కింది కానీ మన్మోహన్ వ్యక్తిగతంగానూ, యుపిఎ ప్రభుత్వంగానూ ఎదుర్కొన్న పరిస్థితులు పూర్తి మారిపోయాయి. పదవులు, ప్రయోజనాల బేరాలు తప్ప మరే విధాన సమస్యలు లేని ప్రాంతీయ మిత్రులను నిలబెట్టు కోవడానికి ఇష్టం లేని వారిని మంత్రులను చేయడంతోసహా ఆయన చాలా విన్యాసాలే చేయవలసి వచ్చింది. రకరకాల ఆరోపణలు, కుంభకోణాల కేసులతో పెనుగులాడవలసి వచ్చింది. ఆ క్రమంలోనే మిశ్రమ ప్రభుత్వంగనక రాజీ పడాల్సి వచ్చిందని యుపిఎ 2 కాలంలో ఆయన బాహాటంగా ఒప్పేసుకున్నారు. మీడియా ఛానళ్ల అధినేతలతో సమావేశమై యుపిఎ అంటేనే అవినీతి అన్నట్టు చిత్రించవద్దని అభ్యర్థించాల్సి వచ్చింది. ఇన్ని ఆరోపణల మధ్యనా ఎవరూ ఆయన నిజాయితీని శంకించడం గానీ, తనకు వ్యక్తిగత బాధ్యత ఆపాదించడం గానీ జరక్కపోవడం నిజంగా ఆశ్చర్యమే. అదే ఆయన వ్యక్తిత్వ ముద్ర. ఇప్పుడు అదానీ వ్యవహారం మోడీతో సహా రచ్చకెక్కిన తీరుకు ఇది పూర్తి భిన్నం. అక్కడ అన్నీ కొల్లగొట్టుకుపోయినా హుజూర్ దోచుకుపోయిన వారి వివరాలు మాత్రం చెప్పడం లేదు అని పార్లమెంటులో ప్రతిపక్ష నాయకురాలు సుష్మా స్వరాజ్ ఒకసారి కవితతో గేళి చేశారు. నేను మీ కళ్లకు ఆనకపోవచ్చుగానీ కనీసం నా బలమైన ఆకాంక్షనైనా చూడండి అని మన్మోహన్ ఇక్బాల్ కవితతో బదులిచ్చారు! వారిద్దరి కవితా వాగ్వాదాలు రసవత్తరంగా వుండేవి. సాహిత్యంలోనూ ఆయన దిట్ట.

బిజెపి గురివింద నీతులు

2014 ఎన్నికల తరుణంలో వెలువడిన మీడియా సలహాదారు సంజయ్ బారు పుస్తకంలో ప్రధానిగా మన్మోహన్ ఫైళ్లు సోనియా గాంధీకి పంపించిన తర్వాతే నిర్ణయాలు తీసుకునేవారని రాశారు. ఆ బాధ్యత ఎవరు నిర్వహించేవారో కూడా పేర్కొన్నారు. వెంటనే బిజెపి వారు రంగంలోకి దిగిపోయారు. ఇది మోడీ బృందం ప్రచారానికి అస్త్రంగా ఉపయోగపడేందుకు వేసిన అభాండమని నాటి ప్రధాని కార్యాలయం ఖండించింది. ఆ యా పార్టీలు తమ ప్రభుత్వాల విధానాలపై చర్చ చేయడం ప్రజాస్వామ్యబద్ధమే. రాజకీయంగా ఒక పంథా తీసుకోవడం వేరు, రాజ్యాంగ పరంగా నిర్ణయాలు, ఉత్తర్వుల జారీ వేరు. నాగపూర్ ఆరెస్సెస్ రాజగురువుల ముందు మోడీతో సహా మొత్తం బిజెపి మంత్రులు హాజరై నివేదికలిస్తారు గానీ ఇతరులపై లేనిపోని ముద్రలేస్తుంటారు. రాజ్యాంగేతర శక్తుల పాత్రగా నిందిస్తారు, ఆరెస్సెస్‌కు అన్ని వేళలా విధేయంగా వుంటూ ఆదేశాలు తీసుకునే బిజెపిని ఏమనాలి? మన్మోహన్‌ను కేవలం, సోనియా విధేయుడుగా మాత్రమే కొందరు మాట్లాడటం ఎంత పాక్షికమో దీన్ని బట్టే తెలుస్తుంది. ఆయన దేశ సమగ్రతకూ, మానవీయ, లౌకిక విలువలకూ విధేయుడే. సోనియా గాంధీనే గాక ఒక ముఖ్యమంత్రిగా వున్న వైఎస్ రాజశేఖర రెడ్డినీ అమితంగా గౌరవించేవారట. 'వై.ఎస్ అక్కడ (ఉమ్మడి ఎ.పిలో) వున్నారు గనకే నేను ఇక్కడ వున్నాను' అని ప్రధాని తనతో ఎప్పుడూ చెప్పే వారని సంజయ్ బారు ఇటీవల కూడా వెల్లడించారు. 2005లో ప్రజాశక్తి రజతోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మన్మోహన్ సిపిఎం నేత సీతారాం ఏచూరిని భారత రాజకీయాల్లో ప్రకాశవంతమైన తారగా అభివర్ణించారు. వామపక్షాలు అణు ఒప్పందంపై మద్దతు ఉపసంహరించుకునే తరుణంలో కూడా వాటిపై తనకు కోపం లేదనీ, మిత్రులుగా కలసి పనిచేస్తామని ప్రకటించారు. తీవ్ర ఉద్రిక్తతలు, వైరుధ్యాల మధ్య తెలంగాణ విభజన చట్టాన్ని ఆమోదించడం ద్వారా తెలంగాణకు, ప్రత్యేక హోదా ప్రకటించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు ఆయన ఇష్టుడయ్యారు. ఇవన్నీ ఆయన పరిపక్వతను చెబుతాయి.

గౌరవంగా వీడ్కోలు

2002 గుజరాత్ ఘటనల తర్వాత మోడీ వైపు మొగ్గిన కార్పొరేట్ శక్తులు ఆయనను ప్రధాని అభ్యర్థిగా ముందుకు తెచ్చినప్పుడు మన్మోహన్ తీవ్రంగానే ఢీకొన్నారు. కాంగ్రెస్ 1984లో సిక్కులపై హత్యాకాండతో కళంకం ఆపాదించుకున్నప్పటికీ ఆ పార్టీ తరపున దేశానికే తొలి సిక్కు ప్రధానిగా ఆయన భారత దేశ బహుళతాన్ని చాటారు. మత సామరస్యం, లౌకికతత్వం కోసం గట్టిగా నిలబడ్డారే గాని మతపరమైన పాచికలకు పాల్పడలేదు. ఇన్ని చెప్పే మోడీ దర్యాప్తు సంస్థలు 2015లో ఆయనకు నోటీసులు పంపించాయి. అయినా తగ్గకుండా నిలబడ్డారు. నోట్ల రద్దును చారిత్రక ఘోర తప్పిదం అని సంచలన విమర్శలు చేశారు. చక్రాల కుర్చీలో వచ్చి మరీ సభలో ఓటేశారు. అనారోగ్యంలోనూ మొన్నటి ఏప్రిల్ దాకా రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడుగా వున్నారేగానీ ఊగిసలాడలేదు. అందువల్ల బిజెపి అపహాస్యం చేసినట్టు ఆయన మౌన మునిగా లేరు. వాస్తవానికి నోట్ల రద్దు నుంచి అదానీ వ్యవహారం వరకూ చాలా విషయాల్లో మోడీయే సభలో సమాధానమివ్వకుండా మౌనం పాటించారు. మీడియా సమావేశాలను మోడీ దూరం పెట్టారేగాని మన్మోహన్ మాట్లాడుతూనే వచ్చారు. ఆయననూ గాంధీ కుటుంబాన్ని ప్రత్యర్థులుగా చూపడానికి బిజెపి ఎంత రెచ్చగొట్టినా సంయమనం వీడలేదు. కనుకనే మన్మోహన్ ఒకసారి కోరినట్టు దేశం, చరిత్ర ఆయన పట్ల నిర్దయగా గాక గౌరవంగానే వ్యవహరిస్తున్నాయి. అయితే మన్మోహన్ సింగ్‌పై ఎంతో గౌరవం ఒలకబోస్తూనే ఆయన అంత్యక్రియల ప్రదేశం, స్మృతి చిహ్నం నిర్మాణం మోడీ సర్కారు వివాదాస్పదం చేసింది.

కాంగ్రెస్ నాయకత్వం నెహ్రూ కుటుంబ నేతల స్మారక కేంద్రమైన 'శక్తి స్థల్'ను ప్రతిపాదించింది. దానికి సమ్మతి చెప్పకుండా మరో చోటును ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేశాక ముందు అంతిమ సంస్కారాలు పూర్తయ్యాక స్మారక నిర్మాణంపై నిర్ణయం చేస్తామన్నది. పి.వి.నరసింహారావుకు రాజధానిలో గాక హైదరాబాద్‌లో అంత్యక్రియలు చేయడంపై వివాదం బిజెపి మళ్లీ తీసుకొచ్చింది. ప్రణబ్ ముఖర్జీ కూతురు శర్మిష్ట తన తండ్రి మరణం తర్వాత కాంగ్రెస్ సరిగా వ్యవహరించలేదని చేసిన ఆరోపణను కూడా ప్రయోగించింది. ఏమైనా గౌరవ నివాళి అంటూనే రాజకీయ వివాదం చేయడం మోడీ సర్కారు చిత్తశుద్ధి లేమిని, అర్ధ మనస్కతనూ బయట పెట్టుకుంది. పదేళ్ల పాటు పాలించిన మూడో ప్రధాని సింగ్ మాత్రమే గనక ఈ విషయంలో వివాదమే అవసరంలేదు. కానీ తొలి ప్రధాని నెహ్రూను, హత్యకు గురైన ప్రధాని ఇందిరా గాంధీనే ఆమోదించలేని బిజెపి ఇలా చేయడం పెద్ద ఆశ్చర్యం కాదు.

★

సెటైర్

పన్నూడితే పన్ను....

నిద్ర పట్టడం లేదని ఓ తమ్ముడు అటూ ఇటూ పొర్లుతూ చూసిన సెల్లును మళ్ళీ మళ్ళీ చూడడం ఇష్టంలేక లతా అక్కయ్య పాడిన "నిదురపోరా తమ్ముడా" పాట పెట్టుకున్నాడు. ఆహా ఎంత మంచి గొంతు, ఎంత మంచి పాట! నిదురపోరా తమ్ముడా, నిదురలోన గతమునంతా, నిముసమైనా మరచిపోరా! నిజంగా పట్టాలే కాని నిదురకు మించిన వైద్యం లేదు. కరుణ లేని, ఈ జగాన కలత నిదురే మేలురా...! ఓహో అక్కయ్యంటే అలా ఉండాలి. అమ్మలో నుండి "అ" ను తీసుకున్నారు మరి "క్క" ను ఎక్కడి నుండి తీసుకున్నారో అనుకుంటూ తమ్ముడు గతము మాత్రమే కాదు వర్తమానాన్ని మరచి పోదామని లత అక్క పాట వినుకుంటూనే నిద్ర పోయాడు.

• • •

పన్ను నొప్పిగా వుందనడంతో తమ్ముడు అమ్మను పంటి డాక్టరు దగ్గరికి తీసుకుపోయాడు. డాక్టరుగారు ఆమె నోరంతా పరీక్షగా చూసి

"ఈ రెండు పళ్ళు ఎప్పుడు ఊడాయి? ఎవరైనా డాక్టరు పీకాడా...?" అనడిగారు.

"లేదండి, వాటంతట అవే తమకు తాము ఊడిపోయాయి" అమ్మ బదులు తమ్ముడు సమాధానమిచ్చాడు.

"ఐతే ఫ్రీగా పోయాయి కాబట్టి రెండింటికీ కలిపి పద్దెనిమిది శాతం జి.ఎస్.టి కట్టాలి. ఒక్కో దానికి రూ. మూడు వేల చొప్పున అవుతుంది. కాబట్టి రెండు పళ్ళకు రూ.ఆరు వేలు ఫీజు. దానిపై ఒక వెయ్యి ఎనభై రూపాయలు జిఎస్‌టి. అంటే మొత్తం ఏడు వేలా ఎనభై రూపాయలు కౌంటరులో కట్టి రండి. మా క్లినిక్ మొత్తం సి.సి కెమెరా కన్నుల దృష్టిలో ఉంది. మీరు తప్పించుకున్నా లాభం లేదు. ఇక్కడ జరిగే విషయాలన్నీ ప్రభుత్వానికి అంటే నిర్మలా మేడంకు ఈపాటికి పోయే ఉంటాయి. ఏక కాలంలో జి.ఎస్.టి వాళ్ళకూ చేరి ఉంటాయి." అన్నారు డాక్టర్.

"సరే సార్! నొప్పి ఉన్న పన్ను కోసం మళ్ళీ వస్తాము. ముందు ఈ పాత ఫీజు, పన్ను రెండూ కలిపి కట్టి పోతాము" అని పైకి అని

"అసలు మనిషికి పళ్ళ లేకుండా ఉంటే ఎంత బాగుంటుంది?" అని లోపల అనుకొని బయలుదేరాడు తమ్ముడు.

ఇంతలో అమ్మే అడిగింది డాక్టరును "ఈ కెమెరాలేవో అసలే లేని పంటి డాక్టర్లు ఉండరా నాయనా...?" అని

"ఉండరమ్మా. అలా ఉంటే వాళ్ళు నెలకు ఇంత పన్ను పీకే పన్ను కట్టాలని రూలు త్వరలో వస్తుందట. అందుకే అందరూ ఈ సిసి కెమేరాలు పెట్టేస్తున్నారు".

"ఈ పన్ను పోటు ఏమిటిరా? ఇప్పుడు ఈ నొప్పితో ఇలాగే ఇంటికి పోవాలా?"

"ఒక్క వారం తట్టుకో అమ్మా. నా కారు అమ్మేస్తున్నాను కదా. వచ్చే వారం వచ్చి చేయించుకుందాం. ఈ లోపు నీవు ఆ లవంగాలు పంటి దగ్గర పెట్టుకుంటుంటావు కదా. అలా చేయి..."

ఇంతలో కంప్యూటర్ గొంతు వినిపించింది

"లవంగాలపై పన్ను, లవంగాలపై పన్ను"

"ఆ మాటేదో బయట మాట్లాడొచ్చు కదమ్మా!!" అన్నాడు. వాటిక్కూడా పన్ను కట్టాల్సి వస్తుందన్న భయంతో.

• • •

రెండేళ్ళకు ముందు మిత్రుడెవరో మంచి విదేశీ కంపెనీ కారు చవగ్గా అమ్ముతున్నాడని ముచ్చట పడి కొన్న ఆ కారును అమ్ముదామని మెకానిక్కు దగ్గరికి తీసుకుపోయాడు తమ్ముడు.

"ఏం సార్ మళ్ళీ రిపేరా?" అడిగాడు మెకానిక్కు.

"లేదయ్యా, దీన్ని అమ్మేద్దామనుకుంటున్నా" అన్నాడు తమ్ముడు దిగులుగా.

అతనలా అనగానే మెకానిక్కు కంప్యూటర్‌లో ఏదో కొట్టాడు. మొదట కార్ల బొమ్మలొచ్చి తరువాత ఏవో అంకెలు, సంఖ్యలు కనిపించాయి

"చెప్పండి సార్ ఎంతకు అమ్ముతారు?"

"ఎంత వస్తుంది? నేనైతే రెండు లక్షలకు అమ్ముదామనుకున్నా. ఎందుకంటే నేను కొన్నది మూడు లక్షలకు"

అవన్నీ కొట్టాడు మెకానిక్కు తమ్ముడు కంప్యూటర్లో. దాన్ని తెరపై చూపిస్తూ

"చూడండి సార్! రూ.ఇరవై లక్షల కారును మీరు కొన్నది రూ.మూడు లక్షలకు. అంటే రూ.పదిహేడు లక్షలు తేడా. దానిపై జి.ఎస్.టి కట్టాలి. అలాగే మీరు అమ్ముదామనుకున్న రెండు లక్షలపైన కూడా ఈ పన్నే కట్టాలి"

"ఐతే ఒక ఉపాయం. దీన్ని మనం రూ.పది లక్షలకు అమ్మినట్టు చూపిద్దాం" అంటుండగానే...

"నల్ల ధనం, నల్ల ధనం" అంటూ కంప్యూటర్‌లో నుండి వినిపించింది ఇంగ్లీషులో.

• • •

"వద్దు నిర్మలక్కా వద్దు. అన్ని పన్నులొద్దు! వచ్చే మామూలు జీతంలో అన్ని పన్నులు కట్టలేను కట్టలేను...!"

తమ్ముడు కలవరిస్తున్నాడు. తల్లి కొడుకు మొహంపై నీళ్ళు చల్లి లేపింది.

"అంటే ఇది కలా? లేక నిజమా? రెండూ కావచ్చు!!"

అప్పుడర్థమైంది తమ్ముడికి విదేశీ అప్పులో నుండి "అ" ను, పన్నుల లెక్క నుండి "క్క" ను కలిపి ఈ నిర్మలక్కకు పెట్టారని!

కొత్త కొత్త వింత పన్నులతో, కొత్త సంవత్సరానికి స్వాగతం ... సుస్వాగతం...!

ఇంతలో టీవీలో వార్త "కొత్త సంవత్సరానికి పంపే శుభాకాంక్షలపై పన్ను వేయాలని ఆర్థికమంత్రికి సూచనలిచ్చిన ఫిక్కి..."

"అమ్మా! నా మీద ఓ బిందెడు నీళ్ళు చల్లవే.....!!" తమ్ముడు అరుస్తున్నాడు.

- జంధ్యాల రఘుబాబు,
సెల్ : 9849753298

నివాళి

బతుకు చిత్రాల స్రష్ట

వ్యాపారాత్మక సినిమా తెర దించి
వాస్తవిక నవోదయానికి తెర తీసి
నిప్పులాంటి నిజాల్ని వెలికితీసి
జీవితాల్ని సజీవ పాత్రల్లో నిలిపి
కెమెరా కనులతో ప్రదర్శించి
అవార్డుల వర్షంలో తడిసి ముద్దైన
నవీనుడు బెనెగళ్ళ శ్యామ సుందరుడు
కలల లోకంలో విహరిస్తున్న
సినిమా కళను ఇలకు దించి
సహజత్వానికి పట్టం కట్టి
సామాజిక స్పృహతో తెరకెక్కించిన
వాస్తవిక కళాతపస్వి అతడు
వెండితెరైనా బుల్లితెరైనా
ఆ దార్శనికుడి దృష్టి క్రమానికి
అద్దం పట్టే మాధ్యమమై మురిసి
అద్భుత కళాఖండాలు జారువాల్చింది
భారతీయ సామాజిక రుగ్మతల్ని
యథార్థ వ్యథార్థ గాథల్ని
ప్రేక్షకుల్ని స్పందింప జేసేలా
అనితరసాధ్య రీతిలో చిత్రించి
పాత హద్దులు చెరిపేసేలా
వాస్తవిక కోణంలో ప్రదర్శించి
ప్రపంచానికి చూపిన కళాకారుడు!

(శ్యాం బెనెగల్‌కి నివాళి)
- భీమవరపు పురుషోత్తమ్

పట్టపగలు కార్పొరేట్ దోపిడీ

భారత కార్పొరేట్ రంగం పన్ను రాయితీలు పొందుతూ, ఆర్థికాభివృద్ధిని ఎలా నష్టపరుస్తున్నదో తెలియచేస్తూ యుధాజిత్ శంకర్ దాస్ 'ఇండియా టుడే'లో ఒక వ్యాసం రాశారు. అందులోని ముఖ్యాంశాలు...

- గత పదిహేనేళ్లుగా అత్యధిక లాభాలు పోగేసుకుంటున్నా ఉద్యోగుల జీతాలను సాపేక్షంగా పెంచడం లేదు.
- 2017లో జి.ఎస్.టి ప్రవేశ పెట్టాక కార్పొరేట్ కంపెనీలు వ్యక్తులు చెల్లించే టాక్సుల కన్నా తక్కువ మొత్తంలో పన్నులు చెల్లిస్తున్నాయి. 2019 నుండి కార్పొరేట్ పన్నులలో మరింత రాయితీలు పొందాయి.
- పెద్ద మొత్తంలో పన్ను రాయితీలు పొందుతూ కూడా పెట్టుబడులు పెట్టడం కానీ, కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించడం కానీ లేదు.

• • •

కార్పొరేట్ రంగం అనేక రాయితీలు పొందుతూ కూడా ఆర్థికాభివద్ధికి తోడ్పడకపోతే దానిని సరిదిద్దే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. ఆ ప్రభుత్వ పని తీరు ఏమిటో చూద్దాం.

- కార్పొరేట్ రంగం కోరినన్ని పన్ను రాయితీలు ఇచ్చినా కానీ పెట్టుబడుల వృద్ధికి, ఉపాధి అవకాశాలు పెంచడానికి తోడ్పడని కంపెనీలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు?
- కార్పొరేట్ రంగంపై అపరాధ పన్నులు ఎందుకు విధించడంలేదు?
- మార్కెట్ వైవిధ్యత పెరగడానికి ఎందుకు తోడ్పడం లేదు? అంటే మార్కెట్‌లో గుత్తాధిపత్యం పెరగడానికి ఎందుకు సహకరిస్తున్నట్లు?
- వినియోగ డిమాండు పెరగడానికి వీలుగా పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో, ఉపాధి హామీ పనులకు చెల్లించే వేతనాలు పెంచడంలో ఎందుకు విఫలం అవుతున్నట్లు?
- పేదలు, మధ్య తరగతి జనాభా వేతనాలు స్థంభించిపోవడం మూలంగా ఆ యా తరగతి జనాభాలో రుణ భారం పెరిగిపోతున్నా వారికి ఆదాయ మద్దతు ఎందుకు కల్పించడం లేదు?
- అలవిమాలిన స్థాయిలో నెలకొన్న నిరుద్యోగ సమస్య తీవ్రత పట్ల పూర్తిగా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నది?

వినియోగం పెరగనిదే పెట్టుబడులు పెట్టరు. సరుకుల వినియోగం పెరగాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. అంటే ప్రజల ఆదాయాలు పెరగాలి. కానీ నిజ వేతనాలు పెరగక పోవడం, అధిక ధరల మూలంగా ప్రజల ఆదాయాలు దెబ్బతినిపోతున్నాయి. నానాటికీ దేశ ఆర్థిక వ్యవస్థలో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, అవినీతి పెరిగిపోతున్నాయి. దీనికి తోడు కేంద్రం లోని బిజెపి ప్రభుత్వమే ఆదాయపు పన్ను శాఖ, సి.బి.ఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్లను ఉసిగొల్పి కార్పొరేట్ కంపెనీల నుండి పార్టీకి విరాళాలు దండుకోవడం పరిస్థితులను మరింత దిగజారుస్తున్నాయి.

మీ రచనలను పంపాల్సిన మెయిల్
editpageps@ gmail.com

మాజీ ప్రధానిని అవమానించారు

- రాహుల్ విమర్శ

న్యూఢిల్లీ : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియల అనంతరం ఆయన స్మారకంపై వివాదం రాజుకుంటోంది . మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు ప్రత్యేక స్థలం లేకుండా నిగంబోధ్ ఘాట్‌లో దహనం చేశారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. "మాజీ ప్రధానులు మరణించినప్పుడు వారికి గౌరవ సూచకంగా ప్రత్యేక శ్మశాన వాటికలను కేటాయిస్తారు. కానీ మోడీ ప్రభుత్వం మన్మోహన్ సింగ్ భౌతిక కాయానికి నిగంబోధ్ ఘాట్‌లో అంతిమ సంస్కారాలునిర్వహించి అవమానించింది' అని రాహుల్ సోషల్ మీడియా ఎక్స్‌లో రాశారు. కాంగ్రెస్‌ది నీతిమాలిన రాజకీయమని బిజెపి మండిపడింది. మాజీ ప్రధాని స్మారక చిహ్నం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్‌కు, మన్మోహన్‌సింగ్ కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం తెలియజేసిన తరువాత కూడా కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడడం సిగ్గుచేటని బిజెపి ఎంపి సంబిత్ పాత్ర విలేకరుల సమావేశంలో అన్నారు.

మన్మోహన్ స్మారకంపై వివాదం తలెత్తడంతో ప్రభుత్వం అర్ధరాత్రి వివరణ ఇచ్చింది. మన్మోహన్ సింగ్ స్మారకం కోసం స్థలం కేటాయిస్తామని హోంమంత్రి శాఖ తెలిపింది. అందులో కూడా స్థలం ఎక్కడ కేటాయించినదీ చెప్పలేదు.

అమెరికా విదేశాంగ మంత్రితో జై శంకర్ భేటీ

- ఇరు దేశాల భాగస్వామ్యంపై చర్చలు

వాషింగ్టన్ : ప్రస్తుతం అమెరికాలో అధికార పర్యటనలో వున్న విదేశాంగ మంత్రి జై శంకర్ అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో భేటీ అయ్యారు. గత నాలుగేళ్లలో అమెరికా-భారత్ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళ్ళిన తీరును ఇరువురు నేతలు సమీక్షించారు. అనేక రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారం మరింత బలపడిందని అంగీకరించారు. ఈ మేరకు జై శంకర్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇరు పక్షాల మధ్య అవగాహనా స్థాయిలు కూడా గణనీయంగా పెరిగాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య వున్న సంబంధాలు పరస్పర ప్రయోజనాలకు, అంతర్జాతీయ సంక్షేమానికి ఉపయోగపడగలవని జై శంకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. సాంకేతికత, వాణిజ్యం, పెట్టుబడులపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. అమెరికాలోని భారత కమ్యూనిటీ సేవల గురించి కూడా ఆయన మాట్లాడారు.

అజర్‌బైజాన్ విమాన ప్రమాదానికి పుతిన్ క్షమాపణలు

మాస్కో : కజికస్తాన్‌లో ఈ వారంలో సంభవించిన అజర్‌బైజాన్ ప్రమాదానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ క్షమాపణ చెప్పారు. అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియెవ్‌కు ఫోన్ చేసి మాట్లాడిన పుతిన్, ఈ ఘటన పట్ల సంతాపం వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు సానుభూతి తెలియచేశారు. రష్యా గగనతలంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుందని అన్నారు. ఉక్రెయిన్ డ్రోన్ దాడిని రష్యా వైమానిక బలగాలు తిప్పి కొడుతున్న సమయంలోనే ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. ఈ మేరకు క్రెమ్లిన్ శనివారం ఒక ప్రకటన జారీ చేసింది. ఈ విమాన ప్రమాదంలో అజర్‌బైజాన్ పౌరులు 42మంది చనిపోయారు. బాధితుల స్మృత్యర్థం జాతీయ సంతాప దినాలను అజర్‌బైజాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఎయిర్ ట్రాఫిక్ భద్రతా నిబంధనల ఉల్లంఘనలు జరిగాయా అనే అంశంపై రష్యా దర్యాప్తు కమిటీ విచారణ జరుపుతోందని ఆ ప్రకటన పేర్కొంది. రష్యాలోని పౌర, సైనిక నిపుణులను వీటి గురించి ప్రశ్నిస్తున్నామని తెలిపింది. అజర్‌బైజాన్ ప్రాసిక్యూటర్ జనరల్ కార్యాలయానికి చెందిన ప్రతినిధులు ప్రస్తుతం గ్రోజ్నీలో వున్నారు. రష్యా అధికారులతో కలిసి వారు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారని క్రెమ్లిన్ ప్రకటన పేర్కొంది.

భారతీయులకు 10 లక్షల నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాలు

న్యూఢిల్లీ : వరుసగా రెండో సంవత్సరం కూడా భారతీయులకు పది లక్షలకు పైగా నాన్-ఇమ్మిగ్రెంట్ (వలసేతర) వీసాలు జారీ చేశామని అమెరికా రాయబార కార్యాలయం ప్రకటించింది. వీటిలో పర్యాటక వీసాలు కూడా రికార్డు సంఖ్యలో ఉన్నాయి. పర్యాటక వీసాలను పెంచడంతో పాటు వచ్చే సంవత్సరం హెచ్-1బి వీసా నవీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించాలని అమెరికా విదేశాంగ శాఖ భావిస్తోంది. ఈ ఏడాది మొదటి 11 నెలల్లో ఇరవై లక్షల మందికి పైగా భారతీయులు అమెరికాలో పర్యటించారు. గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది 26 శాతం అధికం. ప్రస్తుతం అమెరికాలో యాభై లక్షల మంది భారతీయులకు నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాలు ఉన్నాయి. అమెరికా విదేశాంగ శాఖ ప్రతి రోజూ వేలాది వీసాలు జారీ చేస్తోంది. ప్రస్తుతం అమెరికాలో 3,31,000 మంది భారతీయ విద్యార్థులు నివసిస్తున్నారు. వీరిలో రెండు లక్షల మంది గ్రాడ్యుయేషన్ కోర్సులు చదువుతున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఇది 19 శాతం ఎక్కువ. అమెరికాలో వివిధ ప్రోగ్రాములు పూర్తి చేసుకున్న తర్వాత కూడా ఎక్స్ఛేంజ్ విజిటర్లు రెండు సంవత్సరాల పాటు అక్కడ ఉండేందుకు అవకాశం ఇచ్చారు.

బిజెపికి నిధుల వరద

- ఏడాదిలో రూ.2244 కోట్ల విరాళాలు



న్యూఢిల్లీ : కేంద్రంలో అధికారంలో భాగమైన బిజెపికి పలు కంపెనీల నుంచి నిధుల వరద పారుతున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆ పార్టీ అందుకున్న రూ.2,244 కోట్లలో సగానికి పైగా విరాళాలు అందించిన బిజెపి టాప్ పది దాతలలో రెండు ఎలక్టోరల్ ట్రస్టులు, ఒక సోలార్ ఎనర్జీ కంపెనీ, వ్యాక్సిన్ తయారీ కంపెనీలు ఉండటం గమనార్హం.

బిజెపి కాంట్రిబ్యూషన్ నివేదిక ప్రకారం.. దాని విరాళాలలో ఎక్కువ భాగం ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి వచ్చాయి. ఇది రూ.723.67 కోట్లు అందించింది. ఆ తర్వాత ట్రయంఫ్ ఎలక్టోరల్ ట్రస్ట్ (రూ.127.50 కోట్లు) ఉన్నది. గుర్గావ్‌కు చెందిన ఎసిబెంఇ సోలార్ ఎనర్జీ ప్రయివేటు లిమిటెడ్ రూ.51 కోట్లు అందించింది. ఆ తర్వాతి స్థానాల్లో దినేశ్‌చంద్ర ఆర్.అగర్వాల్ ఇన్‌ఫ్రాకాన్ ప్రయివేటు లిమిటెడ్, అహ్మదాబాద్‌కు చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ, డెరైవ్ ఇన్వెస్ట్‌మెంట్స్, రుంగ్టా సన్స్ ప్రయివేటు లిమిటెడ్, వ్యాక్సిన్ తయారీదారు అయిన భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లు రూ.50 కోట్ల చొప్పున అందించాయి.

దేశంలోని ప్రముఖ ఫార్మా కంపెనీలలో ఒకటైన జైడస్ హెల్త్‌కేర్ లిమిటెడ్.. 2023-24 మధ్య కాలంలో బిజెపికి రూ.25.05 కోట్లు అందించింది. ఉదయ్‌పూర్‌కు చెందిన పిఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్ బిజెపికి రూ.25 కోట్లు సమకూర్చింది. బిజెపికి విరాళం ఇచ్చిన ఇతర ఫార్మా కంపెనీల్లో మాక్లీడ్స్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (రూ.25 కోట్లు), ఇంటాస్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (రూ.25 కోట్లు), అజంతా ఫార్మా లిమిటెడ్, ట్రోకా ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్, క్యాడిలా ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ రూ.5 కోట్ల చొప్పున బిజెపికి విరాళాలుగా అందించాయి.

బిజెపి టాప్-10 దాతలలో రెండు పోల్ ట్రస్టులు

వ్యక్తుల పరంగా చూస్తే.. బిజెపికి పంకజ్ కుమార్ సింగ్ (రూ.15 కోట్లు), రమేశ్ కున్హికన్నన్ (రూ.12 కోట్లు), సునీల్ వచాని (రూ.10 కోట్లు) బిజెపికి విరాళాలు ఇచ్చిన మొదటి మూడు స్థానాలలో ఉన్నారు. కున్హికన్నన్ మైసూర్ ఆధారిత కేన్స్ టెక్నాలజీ వ్యవస్థాపకుడు. పోల్ బాండ్ స్కీమ్‌లో ఏకైక అతిపెద్ద దాత అయిన ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరంలో బిజెపికి రూ.3 కోట్లు అందించింది. 2014-2019 మధ్య ఈ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ రూ.1368 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసింది.

2023-24కు సంబంధించి కాంగ్రెస్, ఇతర పార్టీల కాంట్రిబ్యూషన్ రిపోర్టులను ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. తమకు వచ్చిన విరాళాల్లో రూ.20వేల కంటే ఎక్కువ విరాళాల వివరాలను కాంగ్రెస్ పంచుకున్నది. కాంగ్రెస్‌కు చెందిన ఇతర అగ్రదాతలలో తెలంగాణకు చెందిన ఏడుగురు వ్యక్తులున్నారు. వీరిలో పి. సుధంతిరెడ్డి (రూ.2 కోట్లు), జయచంద్రారెడ్డి (రూ.3 కోట్లు), పారుపాటి మహేందాస్‌రెడ్డి (రూ.3కోట్లు), పి. సుజిత్‌రెడ్డి (రూ.5 కోట్లు), పి. శ్రీనివాస్‌రెడ్డి (రూ.5 కోట్లు), పి. పుష్పలీలరెడ్డి (రూ.3కోట్లు), పి చరణ్‌రాజ్‌రెడ్డి (రూ.3 కోట్లు)లు మొత్తం రూ.24 కోట్లు అందించారు.

సంజయ్ భజంకా, సంతోశ్ భజంకా, సజ్జన్ భజంకా లు కాంగ్రెస్‌కు మొత్తం రూ.10 కోట్లు అందించారు. కార్పొరేట్లలో, బెంగళూరుకు చెందిన క్లాసిక్ ఫెదర్‌లైట్ వాటర్‌ఫ్రంట్ డెవలపర్స్ ఎల్ఎల్‌పి కాంగ్రెస్‌కు మూడు భాగాలుగా రూ.7 కోట్లు ఇచ్చింది. కోల్‌కతాకు చెందిన సెంచరీ ప్లైబోర్డ్ ఇండియా లిమిటెడ్ హస్తం పార్టీకి రూ.5 కోట్లు అందించింది.

పబ్లిక్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా అగర్తలలో నిర్వహించిన సభలో ప్రసంగిస్తున్న మాణిక్ సర్కార్

త్రిపురలో ప్రభుత్వ విద్యా హక్కు దినోత్సవం

అగర్తల : విద్యా హక్కు ఉద్యమాన్ని స్మరించుకుంటూ త్రిపురలో 80వ ప్రభుత్వ విద్య దినోత్సవాన్ని (పబ్లిక్ ఎడ్యూకేషన్ డే) జరుపుకున్నారు. ఈ సందర్భంగా అగర్తల టౌన్ హాలు నిర్వహించిన సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ప్రసంగించారు. ప్రభుత్వ విద్య ప్రజల హక్కు అని నినదిస్తూ త్రిపుర మాజీ ముఖ్యమంత్రి దశరథ్ దేవ్ వర్మ 1945లో ఉద్యమాన్ని ప్రారంభించారు. అదే ఏడాది డిసెంబర్ 27న త్రిపుర పబ్లిక్ ఎడ్యుకేషన్ సొసైటీని దుర్గా చౌదరి పారాలో నెలకొల్పారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతియేటా త్రిపురలో డిసెంబర్ 27వ తేదీని పబ్లిక్ ఎడ్యూకేషన్ డేగా పాటిస్తూ వస్తున్నారు. త్రిపుర జనశిక్షా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నాటి పబ్లిక్ ఎడ్యూకేషన్ ఉద్యమం రాష్ట్రంలో విద్యారంగంలో గణనీయమైన పురోగతికి బాటలు వేసింది.

మన్మోహన్ సింగ్ ఓ రాజనీతిజ్ఞుడు

- జాన్ బ్రిట్టాస్ నివాళి

న్యూఢిల్లీ : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఓ రాజనీతిజ్ఞుడు అని సిపిఎం రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ పేర్కొన్నారు. 2021 జూన్‌లో రాజ్యసభ సభ్యుడిగా పార్లమెంటులో ప్రవేశించినప్పుడు ఆయనతో మాట్లాడాను. సిపిఎంతో నా అనుబంధం గురించి తెలుసుకున్న ఆయన దృఢమైన స్వరంతో.. 'ఏ ప్రభుత్వానికైనా యుపిఎ-1 రోల్ మోడల్' అని చెప్పారు. హరికిషన్ సింగ్ సూర్జిత్, జ్యోతిబసు వంటి నాయకుల కృషి ఫలితమే ఈ సంకీర్ణ ప్రభుత్వం అని వారికి రుణపడి ఉంటానని అన్నారు. అమెరికాకు ఆయనతో పాటు వెళ్ళిన మీడియా ప్రతినిధి బృందంలో నేను కూడా ఉన్నాను. సిపిఎం ఎంపీని, అమెరికాతో అణు ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని తెలిసి కూడా మన్మోహన్‌సింగ్ నన్ను ఆ ప్రతినిధి బృందంలో చేర్చుకున్నారు. ఆయన ఒక చురుకైన రాజకీయ వ్యూహకర్త అని నాకు అప్పుడు అర్థమైంది. 2009లో వామపక్షాల మద్దతు లేకుండా తిరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ-2 అనతి కాలంలోనే అవినీతిలో కూరుకుపోయింది.అది బిజెపి అధికారంలోకి రావటానికి మార్గం సుగమం చేసింది. యుపిఎ-1 హయాంలో వామపక్షాల ప్రభావంతో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ, ఆర్టీఐ, ఆహార భద్రత, విద్యా హక్కు, గిరిజన హక్కులు వంటి పథకాలు, కార్యక్రమాలను తీసుకొచ్చింది. ఈ విధానాలు అసమానతలను తగ్గించే లక్ష్యంతో రూపొందించినవని బ్రిట్టాస్ వివరించారు. 2004 నుంచి 2014 మధ్య మన్మోహన్ సింగ్ అనేక పత్రికా గోష్టులను నిర్వహించారు. ఆయన విదేశీ పర్యటనలో 72 సార్లు, వార్షిక సమావేశాలను పది సార్లు నిర్వహించటంతో పాటు 23 సందర్భాలలో రాష్ట్ర పర్యటనలపై మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి అని జాన్ బ్రిట్టాస్ పేర్కొన్నారు.

నెతన్యాహు సైన్యం రాక్షస దాడులు

- గాజాలో చిట్టచివరి ఆసుపత్రి సిబ్బంది, రోగులపై దౌర్జన్యం
- డైరెక్టర్‌తో సహా పలువురి నిర్బంధం
- ఆపై ఆసుపత్రిని తగులబెట్టి దాష్టీకం

గాజా : పాలస్తీనియన్లను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు సైన్యం చేస్తున్న దాడులకు హద్దే లేకుండా పోతోంది. నర రూప రాక్షసుల్లా అమానవీయ దాడులకు తెగబడుతున్నారు. ఉత్తర గాజాలో పనిచేస్తున్న చిట్టచివరి ఆస్పత్రి కమల్ అద్వాన్ హాస్పిటల్‌కు నిప్పంటించారు. ఇజ్రాయిల్ ఆర్మీ నేరుగా ఆస్పత్రిని లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న దారుణ దాడులతో ఆస్పత్రి వార్డుల్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మెజారిటీ భాగం మంటలకు ఆహుతైందని మీడియా వార్తలు పేర్కొన్నాయి. ఆస్పత్రిపై ఆర్మీ దాడులను అత్యంత ఆటవికమైనవిగా స్థానిక అధికారులు వ్యాఖ్యానించారు. ఆస్పత్రి డైరెక్టర్ హుస్సేన్ అబూ సఫియాతో సహా పలువురు సిబ్బందిని ఇంటరాగేషన్ నిమిత్తం మిలటరీ అదుపులోకి తీసుకుందని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఆస్పత్రి ఆవరణను ఖాళీ చేసి బయటకు వెళ్ళాల్సిందిగా డైరెక్టర్‌కు ఆదేశాలు వెళ్లాయి. తర్వాత సిబ్బంది, రోగులు అందరినీ అల్ ఫరీక్ స్క్వేర్ వద్దకు రావాల్సిందిగా ఆదేశించారు.

చలిలో 12 గంటలు నిలబెట్టి...

దారుణంగా శీతల గాలులు వీస్తుండగా ఆస్పత్రి సిబ్బందిని, రోగులను ఇజ్రాయిల్ మిలటరీ బయట నిలబెట్టిందని, దాదాపుగా దుస్తులు ఊడదీయించి 12గంటలకు పైగా అలాగే నిలుచోబెట్టారని ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న ఇస్మాయిల్ అల్ కహ్లౌట్ చెప్పారు.

ఇజ్రాయిల్ సైన్యం ఆసుపత్రిని తగులబెట్టడంతో వీధుల్లో రోగుల అవస్థలు

కొంతమంది రోగులపై సైనికులు చేయి కూడా చేసుకున్నారని తెలిపారు. సోదా చేసేందుకు దుస్తులు తొలగించడానికి మహిళలు తిరస్కరించడంతో వారి ముఖాలపై గట్టిగా కట్టారని చెప్పారు. చివరకు టాయిలెట్‌లకు వెళ్ళేందుకు కూడా అనుమతించలేదన్నారు. చాలా అవమానకరమైన పరిస్థితులను ఎదుర్కోనాల్సి వచ్చిందన్నారు. ఈ పరిస్థితులతో తాము విసిగి వేసారిపోతున్నామని, ఇక ఎదుర్కొనే శక్తి లేకుండా పోతోందని ఆ వ్యక్తి వాపోయారు. వంటిపై పూర్తిగా దుస్తులు లేకుండా చలిలో వణుకుతూ రెండు గంటల పాటు నడవాల్సి వచ్చిందనిఆస్పత్రిలోనే వుంటున్న మరో వ్యక్తి ఇజ్జత్ రమదాన్ చెప్పారు. తన్నుకుంటూ తీసుకెళ్ళిన తమని విచారించి, ఫోటోలు తీసుకుని, ఛాతిపై, వీపుపై నెంబర్లు వేసి బయటకు పంపారని తెలిపారు. కళ్ళకు గంతలు కట్టి వుంచడంతో అరుపులు వినిపిస్తున్నాయి కానీ ఎవరు కొడుతున్నారో కచ్చితంగా తెలియలేదని ఆస్పత్రి సిబ్బంది షారౌక్ అల్ రంత్సి చెప్పారు. నా వంతు దెబ్బల కోసం వేచి వుండాల్సి వచ్చిందన్నారు. గాజా ఆరోగ్య వ్యవస్థను ఒక పద్ధతిలో ధ్వంసం చేస్తూ రావడం వల్ల వందలు వేల సంఖ్యలో పాలస్తీనియన్లకు మృత్యు ఘంటికలు మోగుతున్నాయని, సరైన వైద్యం అందించే పరిస్థితులే లేకుండా పోయాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) తెలిపింది.

గాజాలో గడ్డ కట్టించే శీతల గాలులతో చిన్నారులు కన్ను మూస్తున్న నేపథ్యంలో మానవతా సాయం తక్షణమే అందాల్సిన అవసరం వుందని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) పిలుపిచ్చింది.

గత 15మాసాలుగా జరుగుతున్న దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 45,436మంది పాలస్తీనియన్లు మరణించారు. 1,08,038మంది గాయపడ్డారు. ముఖ్యంగా ఈ దాడుల్లో 17,492మంది పిల్లలు మరణించారు.

అమెరికాలో పెరిగిన నిర్వాసితుల సంఖ్య

- 7.71 లక్షల మంది వీధుల పాలు

వాషింగ్టన్ : అమెరికాలో నిర్వాసితుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగింది. వర్ణ వివక్ష, ప్రజారోగ్య సంక్షోభాలు, ప్రకృతి విపత్తుల ప్రభావం వంటి కారణాలతో వందలు వేల సంఖ్యలో ప్రజలకు తల దాచుకునే ఆశ్రయం లేకపోయిందని అమెరికా ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు అమెరికా గృహ నిర్మాణాలు, పట్టణాభివృద్ధి విభాగం ఒక నివేదికను విడుదల చేసింది. 2023 జనవరి నుండి 2024 జనవరి మధ్య కాలంలో నిర్వాసితుల సంఖ్య 18శాతం పెరిగిందని పేర్కొంది. దీంతో అమెరికాలో ఆశ్రయం లేని వారి సంఖ్య 7,71,000కు పైగా వుంది. 2022లో ఈ సంఖ్య దాదాపుగా 5,80,000గా వుంది. తక్కువ, ఒక మోస్తరు ఆదాయ వర్గాల వారు ఈ పరిస్థితులను ఎదుర్కొనడానికి ద్రవ్యోల్బణం, గృహ నిర్మాణ రంగంలో సంక్షోభం, వేతనాల ప్రతిష్టంభన వంటివి కీలక కారణాలుగా వున్నాయని ఆ నివేదిక పేర్కొంది. మరీ ముఖ్యంగా లక్షా 50వేల మందికిపైగా పిల్లలు ఈ ఏడాదిలో నిరాశ్రయులు కావడం తీవ్రంగా ఆందోళన చెందాల్సిన అంశమని పేర్కొంది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య కూడా 33శాతం పెరిగింది. ఈ పరిస్థితులు చూస్తుంటే దేశంలో బాలల సంక్షేమంపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా పరిస్థితులు ఇలా వున్నా డల్లాస్, లాస్‌ఏంజెల్స్, పెన్సిల్వేనియాలోని చాల్సే కౌంటీ వంటి నగరాల్లో ఇళ్లసమస్య రికార్డు స్థాయిలో తగ్గింది. మొత్తమ్మీద ఈ ధోరణి ఆందోళనకరంగానే వుందని, తక్షణమే దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోందని నివేదిక పేర్కొంది. వీటికి మూల కారణాలను కనుగొని వాటిని పరిష్కరించే సమర్థవంతమైన, సుస్థిర విధానాలు తీసుకురావాల్సిన అవసరం వుందని పేర్కొంది.

మరింతగా క్షీణించిన దల్లేవాల్ ఆరోగ్యం

(మొదటి పేజీ తరువాయి)

తగు చర్యలు తీసుకోగలదని ఆశాభావం వ్యక్తం చేసింది.

దల్లేవాల్‌కు వైద్య సాయం అందించాలని గతంలో తాము జారీ చేసిన ఆదేశాలను అమలు చేయకుండా పరిస్థితులు పెచ్చరిల్లేందుకు దోహదపడ్డారంటూ పంజాబ్ ప్రభుత్వాన్ని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సుధాంశు ధూలియాలతో కూడిన సుప్రీం వెకేషన్ బెంచ్ మందలించింది. కాగా దీనిపై పంజాబ్ ప్రభుత్వం నిస్సహాయతను వ్యక్తం చేసింది. దల్లేవాల్‌ను చుట్టుముట్టిన రైతుల నుండి తమకు తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోందని తెలిపింది. ఆయనను ఆస్పత్రికి తరలించనివ్వకుండా వారు అడ్డుపడుతున్నారని పేర్కొంది. నిపుణుల బృందం నిరసనలు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించిందని, దల్లేవాల్‌ను ఒప్పించేందుకు ప్రయత్నించిందని పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మిందర్ సింగ్ బెంచ్‌కు తెలియచేశారు. ఐవి డ్రిప్స్‌తో సహా ఏ తరహా వైద్య సాయాన్ని అందుకోనంటూ దల్లేవాల్ తిరస్కరించారని చెప్పారు. అలా తీసుకుంటే రైతు ఉద్యమ ప్రయోజనం దెబ్బతింటుందని చెప్పారన్నారు. దీనిపై బెంచ్ తీవ్రంగా అసహనం వ్యక్తం చేసింది. పరిస్థితిని అదుపు చేయడానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు తీసుకోలేదని విమర్శించింది. దల్లేవాల్‌ను ఆస్పత్రికి తరలించడానికి అడ్డుపడుతున్న రైతు నేతలు క్రిమినల్ నేరానికి పాల్పడుతున్నారని వ్యాఖ్యానించింది. దల్లేవాల్ తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, ఆయన చుట్టువున్న వారు ఆయన శ్రేయోభిలాషులుగా కనిపించడం లేదని బెంచ్ వ్యాఖ్యానించింది. ఆయన ప్రాణం గురించి ఆలోచిస్తున్నారా? లేక మరేదైనా యోచిస్తున్నారా అని బెంచ్ ప్రశ్నించింది. పంజాబ్ ప్రభుత్వం తమ ఆదేశాలను అమలు చేస్తుందని ఆశిస్తున్నామని పేర్కొంది.

చర్చలు ప్రారంభించాలి : సిపిఎం

గత నెల రోజులపై నుండి నిరాహార దీక్ష చేస్తున్న దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి విషమంగా వుందని, రైతు సంఘాలు చేస్తున్న డిమాండ్లన్నీ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినవే అయినందున కేంద్రం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కానీ కేంద్రం అందుకు తిరస్కరిస్తున్నందున ఈ పరిస్థితికి పూర్తి బాధ్యత కేంద్రానిదేనని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. దేశవ్యాప్తంగా రైతుల్లో ఈ పరిస్థితులపై తీవ్ర ఆందోళన, అశాంతి నెలకొన్నాయని పేర్కొంది.

ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తక్షణమే అన్ని రైతు సంఘాలు, ఉమ్మడి వేదికల ప్రతినిధులతో చర్చలు ప్రారంభించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న వారి డిమాండ్లను నెరవేర్చాలని పొలిట్‌బ్యూరో కోరింది.

పాపం పసిపాప !

- ఆరు రోజులుగా బోరుబావిలోనే
- రక్షించాలని రోదిస్తున్న తల్లి

జైపూర్ : రాజస్థాన్‌లోని కోట్‌పుత్లీ- బెహ్రార్ జిల్లాలో చేతన అనే మూడేళ్ల చిన్నారి పొలంలో ఆడుకుంటూ 700 అడుగుల బోరుబావిలో పడిపోయి శనివారం నాటికి ఆరు రోజులు అయ్యింది. చేతనని కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బోరుబావిలో 150 అడుగుల వద్ద చేతన ఉన్నట్లు గుర్తించిన సహాయక సిబ్బంది బయటకు తీసేందుకు నిర్విరామంగా శ్రమిస్తున్నారు. సోమవారం ఈ ఘటన జరగ్గా.. ఇప్పటివరకు చిన్నారిని బయటకు తీయకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తన బిడ్డను రక్షించాలంటూ బాలిక తల్లి అధికార యంత్రాంగాన్ని ప్రాధేయపడుతున్న తీరు చూసినవాళ్ల సైతం కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. సంబంధిత అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తొలత కుటుంబసభ్యులు ఆ పాపను రక్షించేందుకు యత్నింగా.. మరింత కిందకు జారుకుంది. ఈ క్రమంలోనే ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, స్థానిక పోలీసు సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. పైపుతో బోరుబావిలోకి ఆక్సిజన్ పంపిస్తున్నారు. మంగళవారం క్లిప్‌ల సాయంతో 30 అడుగులు పైకి లాగారు. అయితే ఆ తర్వాత బయటకు తీయడం కష్టతరంగా మారింది. దీంతో చిన్నారి పడిపోయిన బోరుబావికి సమాంతరంగా సొరంగం తవ్వడంపై అధికారులు దష్టి సారించారు. తద్వారా బాలిక వద్దకు నిపుణులు చేరుకుని బయటకు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు ర్యాట్ హోల్ మైనర్స్ సహాయం తీసుకుంటునట్లు అధికారులు తెలిపారు. ఎన్ని సవాళ్లు ఎదురైనప్పటికి చిన్నారిని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తామన్నారు.

కలెక్టర్మ కూతురయితే ఇలాగే వదిలేస్తారా?

తన బిడ్డను కాపాడాలని అధికారులను చేతన తల్లి ధోలీ దేవి ప్రాధేయపడుతున్న తీరు అందరినీ కలిచివేసింది. 'ఆరు రోజులైపోయింది. నా బిడ్డ ఎంత ఆకలితో ఉందో? ఎంత దాహమేస్తోందో? నా బిడ్డ కలెక్టరమ్మ కూతురైతే ఇలానే జరిగేదా? బిడ్డను అలా వదిలేశేవారా? దయచేసి నా బిడ్డను త్వరగా బయటకు తీసుకురండి' అని దోలీ దేవీ అధికారులను కోరారు.

తైవాన్‌కు ఆయుధాలు విక్రయిస్తున్న ఏడు అమెరికన్ కంపెనీలపై చైనా ఆంక్షలు

బీజింగ్ : తైవాన్‌కు ఆయుధాలు విక్రయిస్తున్న ఏడు అమెరికా కంపెనీలపై చైనా శుక్రవారం ఆంక్షలు విధించింది. తైవాన్‌కు ఇటీవల అమెరికా సైనికపరంగా సాయమందించడం, ఆయుధాలను విక్రయించిన నేపథ్యంలో మిలటరీ, పారిశ్రామిక రంగాలకు చెందిన ఈ కంపెనీలపై, ఆ కంపెనీల సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లపై ఆంక్షలు విధించింది. తైవాన్‌కు అమెరికా ఎం1ఎ2టి ట్యాంక్‌లను సరఫరా చేయడంపై స్పందిస్తూ వేర్పాటువాద ప్రయత్నాలు ఏవైనా అణిచివేస్తామని గురువారం హెచ్చరించింది. ఈ చర్యలన్నీ చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని, చైనా సార్వభౌమాధికారానికి, ప్రాదేశిక సమగ్రతకు భంగం కలిగించడమేనని చైనా విదేశాంగ వ్యవహారాల శాఖ విమర్శించింది. ఈ ఆంక్షలు క్రింద చైనాలో ఈ ఏడు కంపెనీలకు చెందిన ఆస్తులను జప్తు చేస్తారు. ఆ కంపెనీలతో వ్యక్తులు లేదా సంస్థలు ఎలాంటి లావాదేవీలు జరపరాదు. ఈ కంపెనీలకు చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లపై కూడా చర్యలు తీసుకున్నారు. చైనాలోకి ప్రవేశించడానికి వారిపై నిషేధం విధించారు. వారి ఆస్తులు కూడా స్తంభనకు గురవుతాయి. ఇటీవల అమెరికా తీసుకుంటున్న చర్యలు ఒకే చైనా సూత్రాన్ని దారుణంగా ఉల్లంఘించాయని, పైగా చైనా, అమెరికా మధ్య కుదిరిన మూడు డిక్లరేషన్లను కూడా ఉల్లంఘించాయని చైనా విదేశాంగ శాఖ పేర్కొంది. గతంలో అక్టోబరులో మూడు కంపెనీలపై, గత డిసెంబరులో 13 కంపెనీలపై కూడా చైనా ఇలాగే ఆంక్షలు విధించింది.

తెలుగుతోనే వెలుగు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల్లో కలిగించాలని పిలుపునిచ్చారు. తెలుగునాట గురజాడ, కందుకూరి వంటి వారు సంస్కరణ పథంలో జాతిని నడిపించారని గుర్తుచేశారు. 'మార్పుపేరు'తో ముద్రించిన మహాసభల ప్రచురణ గ్రంథాన్ని విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు వై.సుజనాచౌదరి ఆవిష్కరించి మాట్లాడారు. మాతృభాష కళ్లయితే, పర భాష కళ్లజోడు లాంటిదని వెంకయ్యానాయుడు ఎప్పుడూ చెప్పేవారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'ఇతర భాషలు నేర్చుకోండి... మాతృభాషపై మమకారం పెంచుకోండి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో మహాసభ గౌరవ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎంపి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, తమిళనాడు హోసూరు ఎంపి కె.గోపీనాథ్, మార్గదర్శి ఎమ్‌డి శైలజా కిరణ్, ఆచార్య కొలకలూరి ఇనాక్, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సినీ గేయ రచయిత భువన చంద్ర, ప్రపంచ తెలుగు రచయితల మహాసభ అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచంద్, కెబిఎన్ కళాశాల సెక్రటరీ తూనుకుంట్ల శ్రీనివాసు, హిందూ ఎస్‌కెపివివి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

1500 మందికిపైగా హాజరు

రెండు రోజులపాటు జరిగే మహాసభ కోసం దేశ విదేశాల నుంచి 1500 మందికిపైగా కవులు, రచయితలు, భాషాభిమానులు తరలివచ్చారు. సభా ప్రాంగణంలో వెయ్యి మందికి పైగా తెలుగు మహనీయుల ఫొటో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ప్రముఖ కవుల ముఖచిత్రాలను ఉంచారు. పొట్టి శ్రీరాములు సభా ప్రాంగణంలోని చెరుకూరి రామోజీరావు ప్రధాన వేదికతోపాటు సదస్సులు, కవితా, సాహిత్య సమ్మేళనాల కోసం మరో రెండు వేదికలను సిద్ధం చేశారు. ఈ వేదికలపై రెండు రోజుల్లో 25కు పైగా సదస్సులు, కవితా, సాహిత్య సమ్మేళనాలు జరుగుతాయి. వీటిలో 800 మందికిపైగా భాషాభిమానులకు వేదికలపై పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. రాజకీయ, న్యాయ, పరిపాలనలో తెలుగు ప్రాధాన్యం పెంచే దిశగా ప్రత్యేక సదస్సులు జరుగుతాయి. పత్రికలు, ప్రసార మాధ్యమాలు, ప్రచురణ సంస్థల్లో మాతృభాష ప్రాధాన్యంపైనా సదస్సులు ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాలు, మహిళా ప్రతినిధులకు ప్రత్యేకంగా సదస్సులు, తెలుగు భాషా పరిశోధనపై, సాహితీ, విద్యారంగ ప్రముఖులు, భాషోద్యమం, శాస్త్రసాంకేతిక రంగం తదితర అన్ని రంగాల్లో మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలనే కోణంలో కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహిస్తున్నారు.

అశ్రునయనాలతో...

(మొదటి పేజీ తరువాయి)

గ్లోబల్ ఇమేజ్, ఆయన సాధించిన అసాధారణ విజయాలు, దశాబ్దాలుగా దేశానికి అందించిన సేవలకు చిహ్నంగా ఆయన స్మారకం ఉండాలని జైరాం రమేష్ పేర్కొన్నారు. అటల్ బిహారి వాజ్‌పేయి స్మార్యకానికి వెంటనే స్థలం ఇచ్చిన ప్రభుత్వం మన్మోహన్ సింగ్‌కు ఎందుకు ఇవ్వలేదని కాంగ్రెస్ ఎంపీ, పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్ ప్రశ్నించారు. ఆయన ఏకైక సిక్కు ప్రధాని, ఆయన స్మారకం భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుంది అని ఆయన అన్నారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ మాట్లాడుతూ, " ఆయన దేశం కోసం, దేశ ప్రజల కోసం పనిచేశారు. దేశంలోని అన్ని వర్గాలనూ ఆయన ఆదరించారు. అటువంటి ఆయనను గౌరవించుకోవాల్సిన సమయం వచ్చింది. ప్రభుత్వం సరైన ఆలోచన చేస్తుందని ఆశిస్తున్నా అని చెప్పారు.

అయితే ఈ విషయంలో మాజీ రాష్ట్రపతి, కాంగ్రెస్ నేత ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ట ముఖర్జీ కాంగ్రెస్ పార్టీకి పలు ప్రశ్నలు సంధించారు. "నాన్న చనిపోయినప్పుడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి కనీసం సంతాపం వ్యక్తం చేయలేదు. రాష్ట్రపతిగా పనిచేసిన వారి విషయంలో అలాంటి ఆనవాయితీ లేదని ఒక సీనియర్ నేత నాతో అన్నారు" అని ఆమె సోషల్ మీడియలో పోస్ట్ చేశారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నం కోసం ప్రభుత్వం స్థలం కేటాయిస్తుందని, ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు తెలియజేశామని కేంద్ర హోంశాఖ తెలిపింది. అయితే, దీనికి ఒక ట్రస్టు ఏర్పాటు చేశామని, ఆ ట్రస్ట్ ఇతర లాంఛనాలన్నీ పూర్తి చేసిన తరువాత స్మారక నిర్మాణ ప్రక్రియను ప్రారంభిస్తామని హోం మంత్రిత్వ శాఖ తెలిపింది.



మీకోసం

ఒక చిన్న పాత్రలో నీళ్లు పోసి అందులో నారింజ తొక్కలు వేసి అయిదు నిమిషాలు మరిగించాలి. వేడి చల్లారక ఆ తొక్కలతో శరీరంపై రాసుకుంటే చర్మం పొడిబారటం తగ్గుతుంది.

జీవన సౌరభం

నేర్చుకోవడం ఎప్పుడైతే ఆపేస్తామో- అప్పుడే మన ఎదుగుదల ఆగిపోతుంది!

కాలంతో మారిన తిండి కథ

శరీరం భేషుగ్గా ఉండాలంటే అది ఆరోగ్యంగా ఉండడం చాలా అవసరం. ఎప్పుడూ ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండాలంటే మనసొక్కటే సరిపోదు.. శారీరక ఆరోగ్యం కూడా చాలా అవసరం. అందుకే ఇప్పుడు ఆరోగ్యంపై అందరికీ శ్రద్ధ పెరిగిపోయింది. ఫలితంగా మన భోజనం ప్లేటులో చాలా చాలా మార్పులొచ్చేశాయి. ఇప్పుడు మనం తినేవన్నీ ఇడ్లీ, చపాతీ, దోశ, పూరీ, బొండాలు కాదు. కార్బొ హైడ్రేట్లు, విటమిన్లు, పీచు పదార్థాలు. ముద్దపప్పు, ఆవకాయ, పులుసు, పచ్చడి స్థానంలో 'ఆరోగ్యంగా ఉండేందుకు, ఆరోగ్యం పాడైతే, నిద్ర పట్టేందుకు, రక్త హీనత లేకుండా, తలనొప్పి రాకుండా, గుండెపోటు దరిచేరకుండా, క్యాన్సర్ కబళించకుండా అంటూ రకరకాల ఆహార పదార్థాలు వచ్చేశాయి. మనకు తెలియకుండానే మనం తినే కంచం రూపం మారిపోయింది. అందులో ఉండే పదార్థాలు కూడా!

భోజనం ప్లేటు వంటగది నుండి బయటికి వచ్చేసి చాలా రోజులైంది. తోపుడుబళ్లు, టిఫిన్ స్టాళ్లు, చిన్నా, పెద్ద హోటళ్లల్లో ఆహారం-ఆరోగ్యం పేరుతో పెద్ద వ్యాపారమే జరుగుతోంది. ఇంట్లో అమ్మ అప్పుడప్పుడు కాసే సగ్గుబియ్యం జావ దగ్గర నుండి వేసవి కాలం తరచూ తాగే రాగి జావ, జొన్న సంకటి, వర్షాకాలం వేడి వేడి సూప్‌లు, శీతాకాలం రోగనిరోధక శక్తిని పెంచే పానీయాలు, సలాడ్‌లు ఇలా ఎన్నో మార్కెట్లో ఆహారాన్ని అంతెత్తున కూర్చోబెట్టాయి. తిండిలో ఇంత మార్పు ఎప్పటి నుండి వచ్చింది? ఎందుకు వచ్చింది?

1991 నుండి అంటే సరిగ్గా మన భారతదేశంలో సరళీకరణ విధానాలు అమలు జరిగినప్పటి నుండి ఆహారంలో మార్పులు చోటుచేసుకున్నాయి.అప్పుడు మొదలైన మార్పులు ఈ ఐదు దశాబ్దాల్లో మరింతగా విస్తరించాయి. జనాభా పెరుగుదలతో పాటు ఆహారంలో మార్పులు అనేకసార్లు మారుతూ వచ్చాయి.

కోవిడ్ తరువాత ఆహారం కొత్త కొత్త రూపాలతో మనముందుకు వచ్చింది. ఇప్పుడు చాలామంది క్యాలరీల లెక్కలతో టిఫిన్, భోజనం, డిన్నర్ చేస్తున్నారు. ఉదయం నిద్రలేవగానే వేడి వేడి ఛాయ్, కాఫీలకు బదులుగా ఔషధాలు మరిగించిన వేడి నీళ్లు తీసుకుంటున్నారు. ఇక టిఫిన్ ప్లేట్లు పిల్లలకు ఒకరకం, పెద్దలకు మరో రకం. అనారోగ్యంగా ఉన్నవాళ్లకి ఇంకో రకం. తక్కువ క్యాలరీలు, ఎక్కువ పోషకాల పేరుతో మొలకెత్తిన గింజలు ఒకప్పటి ట్రెండ్. ఇప్పుడు.. ఓట్స్, జావలు, డ్రైఫ్రూట్స్, రంగురంగుల పళ్లు, కూరగాయలు, ఆకు కూరలు, పచ్చివి, సగం ఉడకబెట్టినవి, వేళ్లు, కాడలు, ఆకులు, పూలు, కాయలు, పళ్ల రసాలు, కూరగాయ జ్యూస్‌లు.. ఈ జాబితా చాలా పెద్దదే.

యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ప్రకారం, ఏదైనా ఆహారాన్ని 6 గ్రూపులుగా విభజించవచ్చు - ధాన్యం (బియ్యం, గోధుమలు, మొక్కజొన్న, ఇతర తృణధాన్యాలు), పాడి, గుడ్లు (గుడ్లు, పాలు, జంతువుల కొవ్వులు), మొక్కల ఉత్పత్తులు (కూరగాయలు, పండ్లు, పిండి మూలాలు), మాంసం, చక్కెర, కొవ్వు (చక్కెర, స్వీటెనర్లు, కూరగాయల నూనెలు, నూనె పంటలు, చక్కెర పంటలు), ఇతరములు (పప్పులు, మద్య పానీయాలు).

2015లో జాతీయ ఫుడ్ ఆర్గనైజేషన్ ప్రకటించిన ఒక నివేదిక ప్రకారం.. 1961లో ఒక భారతీయ సగటు కుటుంబ సభ్యుడు రోజుకు 2,010 కేలరీల ఆహారాన్ని వినియోగించేవారు. 2011 నాటికి అది 2,458 కేలరీలకి చేరింది. క్రమ క్రమంగా మన ధాన్యం వినియోగం 63 శాతం నుండి 57 శాతానికి తగ్గింది. ఆ స్థానంలో పాడి, గుడ్లు, మొక్కల ఉత్పత్తుల వినియోగం రెండింతలు పెరిగింది. చక్కెర, కొవ్వు పదార్థాల వినియోగం కూడా 3 శాతం పెరిగింది. అయితే మాంసం వినియోగంలో మాత్రం పెద్దగా మార్పులు రాలేదు. సగటు మనిషి ఆహారం కోసం వినియోగించే సొమ్ములో ధాన్య ఉత్పత్తులకు చాలా తక్కువ ఖర్చు చేస్తున్నారు. మిగిలిన ఉత్పత్తులకి మాత్రం పెద్ద మొత్తంలో వెచ్చిస్తున్నారు.

బ్రేక్‌ఫాస్ట్.. స్నాక్స్..

ఉదయం టిఫిన్ ప్లేట్లో మార్పులు వచ్చినట్లుగానే స్నాక్స్ కూడా వేగంగా మారిపోయాయి. బంగాళదుంప చిప్స్, సమోసా, పకోడా, బజ్జీ, బొండా వంటి వాటితో మొదలై ఇప్పుడు తక్కువ క్యాలరీలు ఉండే ఆహారపదార్థాలు గల స్నాక్స్ వచ్చాయి. పాశ్చాత్య ఆహారపు అలవాట్లు భారత కుటుంబాలను తాకి చాలా కాలం అయ్యింది.

భోజనం ప్లేటు.. ఇక భోజనం ప్లేటు సంగతైతే చెప్పాల్సిన పని లేదు. ఉదయం, సాయంత్రం తేలికపాటి ఆహారం తీసుకుంటే మధ్యాహ్నం భోజనంలో మాత్రం సంపూర్ణ పోషకాలు ఉండాల్సిందేనన్న నియమం వచ్చేసింది. ప్రొటీన్లు, విటమిన్లు ఎక్కువగా ఉన్న కూర, పీచు పదార్థాలు పుష్కలంగా లభించే వడ, బజ్జీ, బియ్యంతో సమానమైన కార్బొహైడ్రేట్లు అంటూ గోధుమలు, జొన్న, కొర్రలు, సామలు, అరెకెలు, క్వినోవా.. ఇలా రకరకాల చిరుధాన్యాలతో చేసిన రవ్వ, పిండితో చేసిన పదార్థాలు, చివర్లో పెరుగు, పండు, స్వీట్‌తో భోజనం ముగిస్తున్నారు. ఇందులో ఆరోగ్యం కోసం తినే ప్లేటు, అనారోగ్యంగా ఉన్న వారి కోసం మరో ప్లేటు, పిల్లల లంచ్ క్యారేజీలో ఇంకో రకం ఉంటున్నాయి.

డిన్నర్.. డిన్నర్‌పై ఇప్పుడు భారతీయులకు విపరీతమైన శ్రద్ధ పెరిగిపోయింది. రాత్రి వేళ మితాహారం తినడం మంచిదన్న అలవాటు బాగా వంటబట్టించుకున్నారు. భోజనం బదులుగా రకరకాల

తీరుతెన్నులు

టిఫిన్లు డిన్నర్‌ని ఆక్రమించాయి. ఇప్పుడు బయట టిఫిన్ స్టాళ్లు ఎక్కువగా కనిపిస్తున్నాయంటే ఇదే కారణం. అంతెందుకు విందులు, వినోదాల్లో కూడా టిఫిన్ చేసేవారి కోసం ప్రత్యేక కౌంటర్లు పెట్టేస్తున్నారు.

సమయం కూడా...

తినే తిండే కాదు, అది తీసుకునే సమయం కూడా ఇప్పుడు బాగా మారిపోయింది. నిర్దిష్ట సమయంలో తింటేనే తిన్నది వంటబడుతుందని, రోగాలు రాకుండా ఉంటాయని చెబుతున్నారు. ఒకప్పటిలా హోటళ్లల్లో అన్ని వేళలా భోజనం అందుబాటులో ఉండడం లేదు. సమయం దాటితే దొరకడం కష్టమన్న పరిస్థితి వచ్చేసింది. ఈ మార్పు ఎక్కడికి దారితీస్తోంది.. మన దేశంలో రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు ఎక్కువ. చాలీచాలనీ జీతాలతో బతుకులు వెల్లదీసే జనాభా కోకొల్లలు. ఉండడానికి ఇల్లు లేని వారి జనాభా కోట్లలో వుంటుంది. తిన్నా, తినక పోయినా పిల్లల చదువుల కోసం ఖర్చు చేసేవారు ఎక్కడ చూసినా కనిపిస్తారు. కానీ మారిన ఈ ఆహారపు అలవాట్లు ఆరోగ్యం పేరుతో జరుగుతున్న పెద్ద వ్యాపారంగా రూపాంతరం చెందింది. ఫలితంగా ఆయా ఉత్పత్తుల ధరలకు రెక్కలొచ్చాయి. ఆస్పత్రి పాలవ్వకుండా ఉండాలంటే ఈమాత్రం ఖర్చు చేయాల్సిందేనన్న దృష్టికి సగటు మనిషి వచ్చేశాడు. ఆరోగ్యం అందరికీ కావాలి. ఆరోగ్యంగా ఉంటేనే బతుకు బండి సాఫీగా సాగుతుంది. అయితే ప్రజల ఆరోగ్యం ప్రభుత్వాల బాధ్యత. ఈ బాధ్యతను విస్మరించడం వల్లే ఇప్పుడు మన భారతదేశంలో తిండి ఖర్చు ఎక్కువైపోయింది. ఇది ఇలానే కొనసాగితే సాధారణ ప్రజల మనుగడ మున్ముందు మరింత కష్టం.. నష్టం..!

రంగవల్లి



19 చుక్కలు 3 వరుసలు, 3 వచ్చేవరకు

- చుండూరు తన్మయి, ఎఎస్ రావ్ నగర్, హైదరాబాద్.

మా చిరునామా
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

నందుడు - ఆనందుడు

గోదావరి తీరమున
అందమైన వనమున
శర్మ అను పండితుడు
శాస్త్రవిద్య నేర్పుచుండె.

చాలామంది విద్యార్థులు
ఆశ్రమంలో వచ్చి చేరి
కష్టపడి విద్య నేర్చి
ప్రయోజకులై వెళ్లిరి.

నందుడు, ఆనందుడును
ఇరువురు స్నేహితులు
అచ్చటను విద్యనేర్వ
వచ్చినట్టి విద్యార్థులు

నందుడు కడు సుబుద్ధి
ఆనందుడు మందబుద్ధి
పాఠాలపై శ్రద్ధ లేక
ఆడుతు కాలం గడిపెను
పరీక్షలప్పుడు నందుడు

సహాయం అందించగ
ఎట్టాగో గట్టెక్కి ఆ
తరగతి దాటిపోయే!

గురువు మందలించిన
ఆనందుడు మారలేదు
చెలిమి కోసము నందుడు
తన పంథా వీడలేదు.

ఒకానొక్క దినమున
రాజధాని నుండి ఒక
పండితుడు అరుదెంచె
విద్యార్థుల పరీక్షింప

నందుడు చక్కగ చెప్పెను
ఆనందుడు వెనుకబడెను
కోపగించి పండితుడు
ఆనందుని శిక్షింపగ,

శర్మ అడ్డు పడినాడు
తప్పొకరిదే కాదని .

అని నందుని చూపెను.
ఇతడూ శిక్షార్హుడని.

బాగా చదివిన వానికి
శిక్ష వేయు మందువేమి?
ఏమి చదవని వాడిని
వెనుకేసుకు వస్తిరేమి?

అని పండితుడనగా
'మర్రిచెట్టు తలచును
తాను నీడ నిత్తునని
చలచల్లగ వుండునని.

కానీ దానికి తెలీదు
మొక్కజాతి ఏవొక్కటి
ఆ నీడన బతకవని
సూర్యరశ్మి తగలదని.

నందుడుండగా తోడు
ఆనందుడు చదవలేడు
తెలియకుండ నందుడు
ఆనందుని ఎదగనీడు'

ఆ మాటలు వినగానే
నందుడు తలదించెను
ఆనందుని మార్చేందుకు
అవకాశం ఇమ్మనెను

శ్రద్ధ పెట్టి చదివించెను
ప్రయోజకుని చేసెను
తనతప్పు దిద్దుకొని
దీవెనలను పొందెను!

- కూచిమంచి నాగేంద్ర,
91821 27880.

కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ పెద్ద జ్యూస్ గ్లాసు నుంచి చిన్న గ్లాసులకు వెళ్లేందుకు ఒకే ఒక్క దారి ఉంది. అదేంటో కనిపెట్టండి.



నేను గీసిన బొమ్మ

కె.లక్కీ 4వ తరగతి, సెయింట్‌ఆన్స్ స్కూలు, చీరాల,

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి.
ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

తెలుగు తేజం నితీశ్ సెంచరీ

- సుందర్ అర్ధసెంచరీ
- టీమిండియా 358/9

నితీశ్ (105 బ్యాటింగ్)

మెల్‌బోర్న్: లంచ్ వరకు నిలబడితే చాలు అనుకున్న మ్యాచ్‌ను ఆస్ట్రేలియా నుంచి లాగేసుకున్నాడు. టీమిండియాను ఫాలో ఆన్ గండం నుంచి గట్టెక్కించాడు. వాషింగ్టన్ సుందర్‌తో కలిసి చేసిన పరుగులు... ఆస్ట్రేలియా క్రీడాకారుల్లో గుబులు పుట్టించాయి. ఈ ఒక్క సెంచరీ కోసం క్రికెట్ ప్రపంచం మొత్తం చూస్తుండిపోయింది. ప్రత్యర్థి అభిమానుల సైతం ఎంతో ఆసక్తిగా ఎదురుచూ సిన క్షణం... తెలుగు తేజం నితీశ్‌కుమార్ రెడ్డి చేసిన సెంచరీ భారత క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమమైనదిగా నిలిచిపోయింది. వరల్డ్ టెస్ట్ చాంపియన్ షిప్ కాదు అంతకు మించి... ఈ సెంచరీ పది వరల్డ్ కప్‌లతో సమానం. దీంతో యావత్ క్రీడాభిమానులు శెహబాష్ నితీశ్ అంటూ పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. విశాఖ కుర్రోడు నితీశ్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్‌లో జరిగిన బాక్సింగ్ డే టెస్ట్‌లో మూడోరోజు సెంచరీతో కదం తొక్కి పలు రికార్డులను తన పేర లిఖించుకున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై 8వ స్థానంలో వచ్చి సెంచరీ కొట్టిన తొలి బ్యాటర్‌గా రికార్డుపుటల్లోకెక్కాడు. ఇంతకుముందు ఈ రికార్డు స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే (87) పేరిట ఉండేది. దానిని అధిగమించాడు. అలాగే ఈ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు కూడా నితీశ్ నెలకొల్పాడు. సీనియర్లంతా నిరాశపర్చినా ఆసీస్ బౌలర్లను ఆడుకున్నాడు. ఒక సిక్స్, 10 ఫోర్లతో కదం తొక్కాడు. ఆల్‌రౌండర్లు జడేజా, సుందర్ సహకారంతో జట్టు స్కోరును 350 దాటించాడు. 99పరుగుల వద్ద ఫోర్ కొట్టి టెస్టుల్లో ఘనంగా తొలి సెంచరీ నమోదుచేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ మరో 116 రన్స్ వెనుకపడి ఉన్నది. పంత్ (28), జడేజా(17) రన్స్ చేశారు. టీమ్ఇండియా తరపున నితీశ్ 104 రన్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో కమిన్స్, బోలాండ్ 3 వికెట్ల చొప్పున తీయగా, నాథన్ 2 వికెట్లు పడగొట్టాడు.

నితీశ్ తండ్రి భావోద్వేగం..

నితీశ్ రెడ్డి సెంచరీ పూర్తి చేసుకోగానే ప్రేక్షకులతో కలిసి మ్యాచ్ వీక్షిస్తున్న నితీశ్ తండ్రి భావోద్వేగానికి గురయ్యారు. సంతోషంతో కన్నీరుపెట్టుకున్నారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

రూ.25లక్షలు నజరానా:ఎసిఎ అధ్యక్షులు కేశినేని శివనాథ్

విశాఖపట్టణానికి చెందిన యువ క్రికెటర్ కె.నితీష్ రెడ్డికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) అధ్యక్షుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ రూ.25 లక్షల నగదు ప్రోత్సాహం ప్రకటించారు.

స్కోర్‌బోర్డు...
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 474ఆలౌట్
ఇండియా తొలి ఇన్నింగ్స్: 358/9

वित्त मंत्रालय
MINISTRY OF FINANCE
सत्यमेव जयते

శ్రద్ధ వహించండి
జీఎస్టీ పన్ను చెల్లింపుదారులు!

ఆర్థిక సంవత్సరం 2023-2024 కోసం దయచేసి ఫారం GSTR-9* మరియు GSTR-9C# లో మీ వార్షిక రిటర్న్‌ను దాఖలు చేయండి

గడువు తేదీకి ముందు
డిసెంబర్ 2024
31

CBC 15502/13/0004/2425

* పన్ను చెల్లింపుదారులు ఫారమ్ GSTR-9 ని ఫైల్ చేయాలి	* పన్ను చెల్లింపుదారులు ఫారమ్ GSTR-9C దాఖలచేయాలి
జిఎస్టీ పన్ను చెల్లింపుదారులందరూ మొత్తం వార్షిక టర్నోవర్ 2 కోట్ల రూపాయల కంటే ఎక్కువ (ఆర్థిక సంవత్సరం 2023-2024 కాలంలో) కింది వి మినహా: . ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ . సాధారణం పన్ను విధించదగిన వ్యక్తి . టిడిఎస్ డిడక్టర్ . టీసీఎస్ కలెక్టర్ . నాన్-రెసిడెంట్ ట్యాక్సబుల్ పర్సన్	ఫారం GSTR-9Cలో స్వీయ-ధృవీకరించబడిన సయోధ్య స్టేట్‌మెంట్‌ను ఫారమ్ GSTR-9లో వార్షిక రిటర్న్‌తో పాటు మొత్తం వార్షిక టర్నోవర్ 5 కోట్ల రూపాయల కంటే ఎక్కువగా (2023-2024 ఆర్థిక సంవత్సరంలో) ఉన్న పన్ను చెల్లింపుదారులు దాఖలు చేయాలి

ఫారం GSTR-9 మరియు ఫారం GSTR-9C ఆలస్యంగాదాఖలు చేస్తే ఆలస్య రుసుము చెల్లించాలి

దయచేసి జిఎస్టీ వార్షిక రిటర్న్‌ల వివరాల కోసం స్కాన్ చేయండి

Central Board of Indirect Taxes and Customs
@cbicindia @cbic_india @cbicindia @CBICINDIA @CBIC india www.cbic.gov.in

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68